తిరుమల తిరుపతి దేవస్థానములు

సప్తగిరి

సచిత్రమాసపత్రిక


జూలై 2015, వెల రూ.5/-



గోవిందుడు...

శంఖ, చక్ర, పద్మ, గదాధరుడైన నారాయణుడు.











ఇటీవల తిరుమలలో జరిగిన
శ్రీ పద్మావతీ శ్రీనివాసుల పరిణయ మహోత్సవ దృశ్యం



నిండు మనసే - నీ పూజ
అండ(గోరకుండు - టదియు నీ పూజ

ఇందు హరి గల(- డందు లే(డనేటి
నిందకు(బాయుటె - నీ పూజ,
కొందరు చుట్టాలు - కొందరు పగనే
అందదుకు మాను - టదియె నీ పూజ.

తిట్టులు గొన్నని - దీవెన గొంతని
నెట్టుకోనిదే - నీ పూజ,
పెట్టిన బంగారు - పెంకును నినుమును
అట్టె సరి యను - టదియు నీ పూజ.

సర్వము నీ పని - స్వతంత్ర ముడిగి
నిర్వహించుటే - నీ పూజ
పర్వి శ్రీవేంకట - పతి నీ దాసుల
పూర్వ మనియెడి - బుద్ధి నీ పూజ. (3-320)

పూర్ణమనస్కుడై ఉండుట, పరులను ఆశ్రయింపకుండుట, భగవంతుణ్ణి సర్వాంతర్యామిగా భావించుట, తోటిమానవులతో శత్రు-మిత్ర భావము వీడుట, స్తుతినిందలలో సమంగా ఉండుట, బంగారం - ఇనుము లాంటి విలువైన, విలువలేని వస్తువులపై సమానదృష్టి కల్గిఉండుట, తాను స్వతంత్రుడన్న విషయాన్ని వీడుట, భగవద్దాసులను పూజించుట - ఇవే భగవంతునికి నిజమైన పూజలని ఈ సంకీర్తనలో నిరూపించాడు అన్నమయ్య.



చక్కగా...

మే నెల సంచికలో హనుమంతులవారి దివ్యవైభవం, దారిదీపాలులో ధన ప్రాభవం, దానగుణ విశిష్టత గురించి చాలా చక్కగా వివరించారు.

– డి. నరసింహులు చెట్టి, పుత్తూరు

ఆనందపరవశం

శ్రీవేంకటేశ్వరస్వామి లీలలు, శ్రీవారి భక్తురాలైన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వ్యాస విశ్లేషణ, శ్రీనృసింహజయంతి విశేషాలు చదివి భగవంతుడు శరణాగతరక్షకుడని తెలుసుకోగలిగాము.

– జె. సుధాకర్ రావు, కాకినాడ

ఆకట్టుకుంది

మే నెల సప్తగిరిలో బాలప్రబోధంలోని జలదానం గురించి మంచికథ ఇచ్చారు, కూర్మావతారం గురించి సమగ్రంగా వివరించారు. రాశిఫలాలు బాగుంది. ఉన్నత సమాజంలో తల్లిదండ్రులు పిల్లల్ని ఏ విధంగా చూస్తున్నారు అనే విషయాన్ని తెలిపే పెద్దల బాధ్యత సంపాదకీయం చక్కగా ఉంది.

– మర్రి వెంకటమహాలక్ష్మి, కృష్ణాజిల్లా

భక్తిపారవశ్యం

అందరిని భక్తిపారవశ్యంలో ముంచెత్తే సప్తగిరి అత్యద్భుతంగా ఉంటోంది. ముఖచిత్రాలు, మధ్య పేజీచిత్రాలు అనూహ్యరీతిలో ఆకట్టుకుంటున్నాయి. శీర్షికలన్నీ చాలా బాగుంటున్నాయి.

– నేమాన సుభాష్ చంద్రబోస్, విశాఖపట్టణం

అపురూపం

అత్యద్భుతం! అద్వితీయం! అపురూపం! ఇది నిజం. గీతాసారమే ఐశ్వర్యం! ఆశ్చర్యంగా అదే శ్రీనివాసం! ఎంత చెప్పినా ఎన్ని వ్రాసినా అణువణువు ఆ శ్రీనివాసుని దివ్యరూపమే సప్తగిరి మాసపత్రిక.

– డా॥ ఆర్.జి. బాబ్జీ, విశాఖపట్టణం.

పన్నీటిజల్లు

అంతర్జాలంలో ఆధ్యాత్మిక గ్రంథాలను త్వరలో పొందుపరచాలన్న తిరుమల తిరుపతి దేవస్థానం ప్రయత్నం ఎంతో కొనియాడదగ్గది. మంచి మంచి పుస్తకాలన్నీ అంతర్జాలంలో చదువుకునే భాగ్యం భక్తులందరికీ తి.తి. దేవస్థానం కలుగజేయడం ఎంతో శ్లాఘనీయం. బాలాజీ భక్తులందరికీ ఈ మాసం సంపాదకీయం పన్నీటిజల్లు కురిపించింది. 'సందేహాలు సమాధానాలు'లో మంచి విషయాల్ని సమాధానాల ద్వారా తెలుసుకుంటున్నాము.

– కె. సన్ని, హైదరాబాదు

2015, ఆగష్టు నెలలో తిరుమల తిరుపతి దేవస్థానముల ఉత్సవ విశేషాలు

8	ఆడికృత్తిక
19	కశ్యపమహర్షి జయంతి
24	తిరుమల శ్రీవారి పవిత్రోత్సవ ప్రారంభం, తరిగొండ వెంగమాంబ వర్ధంతి
28	వరలక్ష్మీవ్రతం
29	జంధ్యాల పూర్ణిమ, హయగ్రీవ జయంతి, రాఖీ, శ్రీవిఖనస జయంతి
30	గాయత్రీజపం

వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన ।
వేంకటేశసమో దేవో న భూతో న భవిష్యతి ॥



శ్రీహరి సర్వాంతర్యామి

గౌరవ సంపాదకుడు :
డా॥ డి. సాంబశివరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకుడు :
డా॥ సి.శైలకుమార్

సంపాదకుడు : డా॥ కె.రాధారమణ
ఉప సంపాదకురాలు : డా॥ అల్లాడి సంధ్య
ముద్రాపకురాలు : యమ్.గౌతమి, యమ్.ఐ.ఎ.,
ఉప కార్యనిర్వహణాధికారి,
(ప్రచురణలు & ముద్రణాలయం)
తి.తి.దే., తిరుపతి
డి.టి.పి. : ప్రధాన సంపాదకులవారి
కార్యాలయం, తి.తి.దే., తిరుపతి
వర్ణ చిత్ర పుటలు : పి.శివప్రసాద్

వివరాలకు :
ప్రధాన సంపాదకుడు,
సప్తగిరి, తి.తి.దేవస్థానములు,
తిరుపతి - 517 507.
ఫోను : 0877-2264543, 2264359

సప్తగిరి
మాస
పత్రిక

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ.500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

సప్తగిరి

తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

సంపుటి : 46 జూలై, 2015 సంచిక : 2

website : www.tirumala.org, www.tirupati.org

24 గంటలు పనిచేసే
తిరుమల తిరుపతి దేవస్థానముల
కాల్ సెంటర్ ఫోన్ నెం.
0877 - 2277777, 2233333

ముఖచిత్రం : శంఖ, చక్ర, పద్మ గదాధరుడు
చివరిపుట : తిరుమల శ్రీవారి ఆణివర ఆస్థానం

సంపాదకీయం

గురుపూర్ణిమ

వ్యాసపూర్ణిమనే గురుపూర్ణిమని వ్యవహరిస్తారు. వ్యాసపూర్ణిమ ఆషాఢ శుద్ధపూర్ణిమనాడు వస్తుంది. ఆదిభిక్షువు శంకరుడని, ఆదికవి వాల్మీకని, ఆదిగురువు వేదవ్యాసుడని ఆర్యోక్తి. ఆదిగురువైన వేదవ్యాసుని స్మరించి పూజించేదినం కాబట్టి దీనిని వ్యాసపూర్ణిమగా పిలుస్తారు.

'గు' అంటే అంధకారాన్ని, 'రు' అంటే నిరోధించేవాడని- కాబట్టి అంధకారాన్ని తొలగించి మనకు జ్ఞానదీపాన్ని వెలిగించేవాడే నిజమైన గురువని అర్థం. ప్రతి ఒక్కరి జీవితంలో గురువుకు ప్రత్యేకమైన స్థానముంటుంది. తల్లిదండ్రుల తరువాత గురుస్థానం గొప్పది. అటువంటి గురువును మనం వ్యాసపౌర్ణమినాడు ప్రత్యేకంగా పూజిస్తాం.

వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే।
నమో వై బ్రహ్మనిధయే వాశిష్ఠాయ నమోనమః ॥

అని వ్యాసునికి విష్ణువుకు అభేదం చెప్పబడింది. వేదవ్యాసుడు అనంతంగా ఉన్న వేదాల్ని వింగడించి, పైలునకు ఋక్సంహితను, వైశంపాయనునకు యజుస్సంహితను, జైమినికి సామసంహితను, సుమంతునకు అథర్వసంహితను బోధించి, వానిని లోకంలో వ్యాపింపచేసినట్లు విష్ణు, మత్స్య, భాగవత, వాయు పురాణాదులు పేర్కొంటున్నాయి. వ్యాసుడు వేదాల్ని విభజించడమేకాక అష్టాదశ పురాణాల్ని రచించాడు. బ్రహ్మసూత్రాల్ని వివరించాడు. భారత భాగవతాల్ని రచించాడు.

పరమపుణ్యప్రదమైన ఈ దినం గురుశిష్యుల బంధాన్ని యుగాలనుండి వ్యక్తం చేస్తుంది. సర్వవిద్యలకు ఆకరమైన ఆదిదేవుడు కూడ అవతారం దాల్చినపుడు గురువులకు శుశ్రూష చేశారు. వారికి అన్నీ తెలిసి ఉన్నప్పటికి ఏమి తెలియనివారిలా గురువులను ప్రశ్నించి నేర్చుకున్నారు. భగవంతుడే శిష్యుడై నేర్చుకున్నప్పుడు మానవమాత్రులైన మనమెంత అని అనిపించక మానదు. జ్ఞానాన్ని పెంచుకోవడమంటే అజ్ఞానాన్ని పారద్రోలడం, అందుకే మహర్షులు, మహనీయులు తమకు తెలిసింది తక్కువని చెప్తుంటారు.

గురుశిష్యసంబంధాన్ని పరమపవిత్రంగా భావించాలి. శిష్యుడిమీద గురువుకి వాత్సల్యం, గురువుమీద శిష్యుడికి అపారమైన భక్తి గౌరవం ఉండితీరాలి. అప్పుడే మనం జ్ఞానమార్గంలో పయనించగల్గుతాం. ఆ గురువే బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు సమానం. అటువంటి గురువును పొందిన శిష్యుని జీవనం ధన్యమౌతుంది.

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః।
గురుస్సాక్షాత్ పరం బ్రహ్మ తస్మై శ్రీగురవే నమః ॥

శుక్రాచార్యులు తాను మరణిస్తానని తెలిసి శిష్యుడైన కచునికి మృతసంజీవనిని ప్రసాదించడం ద్వారా శిష్యునిపై గల వాత్సల్యం వ్యక్తమౌతుంది. అదేవిధంగా ఏకలవ్యుడు తన అంగుష్ఠాన్ని ఇస్తే ఆయుధధారణ చేయలేనని తెలిసినా గురుదక్షిణగా ద్రోణుడికి ఇస్తాడు. ఇది గురుభక్తికి నిదర్శనం. గురుశిష్యుల అనుబంధం అంతమహత్తరమైనది. ఈ శుభదినాన ప్రతిఒక్కరు తమతమ గురువులను పూజించి వారిని వ్యాసభగవానుల రూపంగా భావించి సత్కరించి తరించాలి. భగవత్స్వరూపులైన గురువులు అందించే ఆశీస్సులు శిష్యులైన వారందరూ పొందాలని సప్తగిరీశుని ప్రార్థిద్దాం.

పుష్కర గోదావరి


డా॥ రేవూరు అనంత పద్మనాభరావు, 9866586805
దూరదర్శన్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ (రిటైర్డ్), హైదరాబాదు

బృహస్పతి (గురువు) ఆయా రాశులు పన్నెండింటిలో సంచరించేదాని ననుసరించి ఆయానదులకు పుష్కరశోభ కలుగుతుంది. జూలైనెల 14 వ తేది ఉదయం 6 గంటల 26 నిముషాలకు బృహస్పతి సింహరాశిలో ప్రవేశిస్తాడు. సౌరమానరీత్యా అది శ్రీమన్మథనామసంవత్సర అధికాషాఢ బహుళ త్రయోదశీ మంగళవారం. "సనాతన దృక్సిద్ధ పద్ధతిచే ఇది సంభవించినందున నిస్సంశయముగా ఈ దినము లగాయితు మాతృశ్రీ సార్ధత్రికోటి తీర్థరాజ సహిత శ్రీ గోదావరీనదికి పుష్కరాలు ప్రారంభమౌతుంది" అని జ్యోతిషపండితుల అభిప్రాయం.

ఈ లెక్క గణితసంప్రదాయం ప్రకారము మరియు భారతప్రభుత్వ అయనాంశములచేతకూడ సుమారుగా సరిపోతున్నది. ఈ సమయం పుణ్యకాలంగా భావించి గోదావరీనదియందు సర్వదేవతలు, సమస్తతీర్థాలు, సిద్ధులు, పితృదేవతలు నివసిస్తారు. అందువల్ల ఇది పవిత్రకాలం కనుక స్నాన, దాన, జపతపాలు ఆచరించి ఐహికాముష్మికఫలితాలు పొందవచ్చు.

జూలై 14 నుండి 25 వరకు గోదావరి పుష్కరాలు

పుష్కరవ్రతం 12 రోజులు వుంటుంది. అందువలన జూలై 14 నుండి 25 వరకు ఆది పుష్కరాలు. గోదావరీనదికి అంత్యంలో 12 రోజులు కూడా అంత్యపుష్కరాలు. బృహస్పతి కన్యారాశిలో 2016 ఆగష్టు 11 న ప్రవేశిస్తాడు. దానికి 12 రోజులు ముందు అంటే జూలై 31, 2016 నుండి ఆగష్టు 11 వరకు ఈ అంత్య పుష్కరాలు జరుపుకోవాలి. కోట్లకొలది భక్తులు గోదావరి తీర ప్రాంతంలోని అనేక ఘట్టాలలో ఈ పుష్కరస్నాన విధులు నిర్వహిస్తారు.



గోదావరీనది ఆవిర్భావం

గౌతమమహర్షి బ్రహ్మను ప్రార్థించి తాను విత్తనాలు చల్లగానే ఫలించేవరం పుచ్చుకున్నాడు. ఒక సంవత్సరం దేశంలో విపరీతమైన కాటకం వచ్చింది. మునులందరు తేజశ్శాలియైన గౌతముని వద్దకు వచ్చారు. వారికందరికీ గౌతముడే ఆతిథ్యం ఇచ్చాడు. అలా కొంతకాలం వారు ఆయన ఆతిథ్యాన్ని స్వీకరించారు.

కొందరు మునులకు ఆయన పొలంలో పండే ధాన్యాన్ని చూచి ఈర్ష్య కలిగింది. గౌతముని సంపదను చూచి వారు సహించలేక పోయారు. ఏదో ఒక రకంగా అతనిని భ్రష్టు పట్టించాలని ఆలోచించారు. వారొక మాయాగోవును సృష్టించి దానిని గౌతముని పొలంలో మేస్తుండమని పంపారు. అది పరిపూర్ణంగా వరిని తింటోంది. అప్పుడు వారు గౌతముని వద్దకు వెళ్లి 'నీ పొలంలో గోవు పడిమేస్తున్న' దని చెప్పారు. పండిన పంటను తినుచున్న గోవును చూచి గౌతముడు బాధపడ్డాడు. గోవుకాన దానిని కొట్టలేక గౌతముడు తన చేతిలో ఉన్న జలాన్ని గోవుపై చల్లి వెళ్లిపొమ్మన్నాడు. రెండు నీటి చుక్కలు తగలగానే మాయా గోవు కాస్త చచ్చిపడి పోయింది. వినాయకుడే మునుల ప్రార్థన మేరకు గోవుగా వచ్చాడని ఐతిహ్యం.

ఆ మునులందరూ అది చూచి "గోహత్య చేసిన వానియింట – 'ఛీఛీ' భుజింపరాదు, పోదామ"ని లేచారు. అప్పుడు

గౌతముడు వారిని వినయవిధేయతలతో గోహత్యా పాతక దోష నివారణను తెలియజేయమన్నాడు. వారు యుక్తియుక్తంగా గంగాజలాన్ని గోవు పడివున్న చోటికి ప్రవహింప జేస్తే ఆ పాతకం పోతుందని చెప్పారు. గంగను తెచ్చేందుకు గౌతముడు త్ర్యంబకేశ్వరుని సమీపించి పాదాంగుష్ఠ మాత్రుడై చిరకాలం తపస్సు చేశాడు.

గౌరీ సమేతంగా వచ్చిన పరమేశ్వరుడు గౌతమునితో వరాలు కోరుకోమన్నాడు. 'నీ శిరస్సుపైనున్న గంగను నాతో పంపితే దానిని సాగర గామినిని చేస్తా' నన్నాడు గౌతముడు. భక్త సులభుడైన శంకరుడు 'సరే' నన్నాడు. ఈశ్వర సందర్శనానికి కారకులైనందుకు మునులపట్ల కృతజ్ఞత వెలిబుచ్చాడు గౌతముడు. ఆ గంగాస్నానం చేసిన గౌతముడు గోవును తాకగానే జలధార పైకుబికి గోవు బ్రతికింది.

గౌతముడు తనతో వస్తున్న గంగతో పర్వతాలు, గుట్టలు దాటి 'కోటిఫలి' క్షేత్రాన్ని సమీపించాడు. అదే ఇప్పటి కోటిపల్లి. బాగా అలసిపోయిన గౌతముడు శ్రమ తీర్చుకొనేందుకు అక్కడ గంగను ఆపాడు. తాను శ్రమ తీర్చుకొంటున్నాడు.

అక్కడికి ఒకవృద్ధస్త్రీ వచ్చింది. గౌతముని ఎదుట నిలబడి 'నీ కోసం నేను జన్మపర్యంతం తపస్సు చేస్తున్నాను. నన్ను పెళ్లిచేసుకో' మంది. ఇద్దరికీ వయస్సులో సగం తేడా. అయినా ఆమె కోరికను మన్నించి గౌతముడామెను వివాహమాడాడు. గంగానదిని కమండలువులో బంధించాడు. ఆ భామినితో విహరిస్తూ ఇసుకతిన్నెపై నిద్రిస్తున్నాడు.

ఆ సమయంలో కమండలువులోనున్న గంగను కమండలంతో సహా భరద్వాజ మహర్షి చేతిలో పట్టుకొని పరుగులు తీశాడు. ఆ భామిని భరద్వాజుని వద్దకు వెళ్లి ఆ జలాన్ని తెచ్చి గౌతమునిపై చల్లగా, గౌతముడు 32 సంవత్సరాల వయస్సుగలవాడైనాడు. భరద్వాజుని చేతిలోవున్న ఆ జలాన్ని సముద్రగామినిని చేశారు. దానికి 'వృద్ధాంతర్గత భరద్వాజ గౌతమి' అని పేరు.

గౌతముడు తీసుకొచ్చాడు గాబట్టి గౌతమి అనీ, గోవును రక్షించిన జలం గాబట్టి గోదావరి అని పేరు వచ్చింది. గోదావరీ నది పాయలు, వివిధ ప్రాంతాలలో సముద్రంలో కలిశాయి. ధవళేశ్వరం క్రింది నుంచి ఒక భాగం విడివడి 'తుల్య' అనే పేరుతో కోరంగి వద్ద సముద్రంలో చేరింది. మరొక భాగం అత్రిమహర్షిచే సముద్రంలో కలిసి 'ఆత్రేయ' అని పిలవబడుతోంది. వృద్ధకన్యచే తేబడినది 'వృద్ధగౌతమి'. ఇది అంతర్వాహిని. పైకి కనిపించదు. ఇక్కడ బావిని తవ్వితే నీరు చంద్రోదయసమయంలో క్షారంగాను, ఇతరసమయాలలో అతిమధురంగాను ఉంటాయి.

విశ్వామిత్ర మహర్షి తపస్సు చేసి గౌతముని నుండి ఒక భాగాన్ని స్వీకరించి సముద్రాన్ని చేర్చాడు. అది కౌశికి. ఇది అమలాపురం తాలుకాలోని గ్రామాలను చుట్టుముట్టి 50 గజాల వెడల్పుతో సముద్రంలో కలిసింది. వైనతేయులు గంగను దొంగిలించి తీసుకెళ్లారు. దానిని వసిష్ఠమహర్షి సంగ్రహించి అంతర్వేదివద్ద సముద్రంలో కలిపాడు. అది 'వాసిష్ఠ' అనే పేరుతో ప్రసిద్ధికెక్కింది. ఈ సమీపంలో లక్ష్మీనృసింహస్వామిక్షేత్రం వెలసి భక్తుల అభీష్టాలు తీరుస్తోంది. ఈ క్షేత్రం త్రికోణాకారంలో ఉండటంచేత అంతర్వేది అని పిలువబడుతోంది. ఇక్కడ క్షేత్రపాలకుడు నీలకంఠేశ్వరుడు. అంతర్వేదిలో ప్రస్తుతం వసిష్ఠాశ్రమం వెలసింది. అక్కడ వసిష్ఠుని విగ్రహము, సప్తర్షుల విగ్రహాలు అన్నీ పూజలను అందుకొంటున్నాయి. ఇక్కడ గోశాలకూడా ఉంది. తీర్థయాత్రకు వచ్చినవారు ఈ వసిష్ఠాశ్రమాన్ని విశేషంగా సందర్శిస్తారు.



పౌరాణికులు 'సప్తధాసాగరం యాంతి' అని గోదావరికి ఏడుపాయలు ఉన్నట్లు చెబుతారు. ధవళేశ్వరం క్రింది నుంచి ఏడుపాయలుగా చీలి అవి సముద్రంలో కలుస్తాయి. గురుడు సింహరాశిలో ప్రవేశించిన సమయంలో పుష్కరరాజు సార్ధత్రికోటి తీర్థయుతుడై, గోదావరీ నదిలో ప్రవేశించి ఒక సంవత్సరకాలం గోదావరినాశ్రయించి ఉంటాడు.

పుష్కర విశేషాలు

అంతఃకరణ పరిశుద్ధమై, ఆత్మతత్త్వజ్ఞానాన్ని పొంది, పుష్కరస్నానంతో మోక్షం సిద్ధిస్తుంది. స్నానము, దానము, తీర్థశ్రాద్ధాదులు అనంతఫలదాయకాలని విశ్వాసం. పుష్కరాలు 12 సంవత్సరాలకొకసారి ఒక నదిలో వస్తాయి. అలాంటి 12 గోదావరీ పుష్కరాలు అంటే 144 సంవత్సరాల తర్వాత మళ్లీ రావడం ఈసారి విశేషం.


అసలు ఈ పుష్కరుడెవరు?

శ్రీమహావిష్ణువును 'పుష్కరాక్షుడు' అని పిలుస్తారు. పుష్కర అంటే పోషించేది, పవిత్రతను చేకూర్చేది – అని అర్థం. సంప్రదాయ జ్యోతిషంలో – పుష్కర నవాంశ – అనే పదం వాడుకలో ఉంది. అక్కడ గ్రహాలన్నీ పోషింపబడతాయి. రాజస్థాన్ రాష్ట్రంలో 'పుష్కర సరస్సు' ఉంది. ఇక్కడ బ్రహ్మదేవునికి ఆలయం ఉంది. బ్రహ్మకు ఆలయం ఉండదని భృగువుశాపం. అందుకే దేశంలో బ్రహ్మ ఆలయాలు అరుదు. పుష్కరకాలంలో నదీస్నానం చేస్తే పూర్వ జన్మపాపాలు, ఈ జన్మపాపాలు నశిస్తాయని బ్రహ్మాండపురాణం చెబుతోంది. పుష్కరస్నానం అశ్వమేధయాగం చేసిన దానితో సమానం అంటారు పెద్దలు.

గంగ, నర్మద, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణ, కావేరి, భీమ, పుష్కరవాహిని, తుంగభద్ర, సింధు, ప్రాణహిత నదులలో మేషాదిమీనరాశులు పన్నెండింటిలో సంవత్సరకాలం పాటు పుష్కరుడుంటాడు. అందుకే 12 సంవత్సరాలకొకసారి పుష్కరాలు ఆయానదులలో వస్తాయి. గోచార రీత్యా గురు సంచారానికి ఒక రాశినుండి మరొక రాశికి సంవత్సరకాలం పడుతుంది.

శాస్త్రీయ దృక్పథంతో ఆలోచిస్తే పుష్కరకాలంలో ఆ నదీజలాలకు అయస్కాంత శక్తి లభించి శరీరం యావత్తు ధ్యానావస్థలోకి వెళ్లిపోతుంది. అందుకే పుష్కరస్నానం పవిత్రం.





జూలై 17
శ్రీవారి ఆణివర ఆస్థానం

ప్రతి సంవత్సరం దక్షిణాయన పుణ్యకాలం, కర్కాటక సంక్రాంతి నాడు తిరుమలలో "ఆణివర ఆస్థానం" అనే ఉత్సవం జరుగుతుంది. తమిళుల ఆణిమాసం చివరిరోజున జరిగే ఆస్థానం కనుక దీన్ని "ఆణివర ఆస్థానం" అంటారు. ప్రతి సంవత్సరం జూలై 17న ఈ ఆస్థానం జరుగుతుంది.

పూర్వం దేవస్థానం వారి ఆదాయవ్యయాలు, నిలువలు, మున్నగు సంవత్సర లెక్కలు ఈ ఆణివర ఆస్థానం రోజున ప్రారంభమయ్యేవి. ఆరోజు బంగారు వాకిలిముందు సర్వభూపాల వాహనంలో శ్రీదేవి, భూదేవులతో శ్రీమలయప్పస్వామివారిని వేంచేపు చేస్తారు. మరొక పల్లకిపై విష్వక్సేనులవారిని వేంచేపు చేసిన అనంతరం ఘనంగా వస్త్రసమర్పణ, నివేదనలు జరుగుతాయి. పిదప అక్షతారోపణ జరిగిన తర్వాత కార్యనిర్వహణాధికారికి దేవస్థానం బీగాల గుత్తిని తగిలించి హారతి, శఠారులను ఇస్తారు. ఆ తర్వాత ప్రసాద వితరణ జరుగుతుంది.

బంగారు వాకిలి ముందు జరిగే ఆణివర ఆస్థానంలో అర్చకులు, జియ్యంగార్లు అధికారులు దేవస్థానం ఉద్యోగులు మాత్రమే పాల్గొంటారు.





ఆచార్య కె.సర్వోత్తమరావు, తిరుపతి, 9704704000

జూలై 21 గరుడపంచమి

పంచాంగాలను పరిశీలిస్తే 'పంచమి' తిథుల్లో సుమారు పదమూడు పర్వాలు కనిపిస్తాయి. వాటిలో మధ్యతరగతి కుటుంబీకులకు తెలిసిన పర్వాలు – నాగపంచమి, ఋషిపంచమి, గరుడపంచమి. శ్రావణశుక్ల పంచమి రోజున జరుపుకొనే పండుగ "గరుడపంచమి". ఈ పంచమి – గరుడునికున్న ప్రాధాన్యం బట్టి జరుగుతున్నది. ఎన్నో పక్షాదులుండగా గరుడుని పేరుతో పాటింపబడే పర్వవైశిష్ట్యం గురించి తెలుసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉంది. సూక్ష్మంగా చెప్పాలంటే గరుడుడు నాగుల కోరిక మేరకు 'అమృతభాండం' తెచ్చిన పుణ్యదినమే గరుడపంచమి. ఈ సందర్భంలో గరుడుని వృత్తాంతం తెలుసుకోవడం, వినడం, సేవించడం పుణ్యప్రదం.

వేదాలలోనే గరుడుని ప్రస్తావన కనిపిస్తుంది. సుపర్ణ, తార్క్ష్య, గరుత్మత్ పదాలతో గరుడుడు సూచింపబడ్డాడు. ఆ తరువాతి 'ఆరణ్యకాలలో' ఎన్నో దేవతలకు 'గాయత్రి' ఉన్నట్లే 'గరుడగాయత్రి' ప్రశంస కనిపిస్తుంది. ఉపనిషత్తులలో ఒకటి 'గరుడోపనిషత్' ఉండడం కూడా గుర్తించదగ్గది. ఇంకా ఆలయపూజాదికాలను ప్రస్తావించే ఆగమాలలో గరుడపటం తయారి, గరుడస్తంభనిర్మాణం, బ్రహ్మోత్సవకాలాలలో ధ్వజారోహణం అలాగే ధ్వజావరోహణ విధులెన్నో ఉన్నాయి.

ఇక కావ్యవాఙ్మయం పరిశీలిస్తే శ్రీమద్రామాయణం, భారతంలాంటి ఇతిహాసాలలో గరుత్మంతుని కథలున్నాయి. శ్రీమద్రామాయణంలో జటాయువు తన వంశక్రమంలో వినత గురించి, వినత సంతానం గురించి ప్రస్తావించిన ఆధారాలున్నాయి. ఇంద్రజిత్తు నాగపాశాలకు రామలక్ష్మణులు బంధితులైతే, గరుడుడే వారిని విడిపించాడనే సన్నివేశముంది.

మహాభారతంలో 'సుపర్ణోపాఖ్యానం' గరుత్మంతుని జన్మ గురించి, ప్రతాపం గురించి వివరిస్తుంది. గాలవుడనే శిష్యుడు తన గురువైన విశ్వామిత్రునకు ఎనిమిదివందల విశిష్టధనువులను సమర్పించవలసిన పరిస్థితిలో ఆదుకున్నవాడు గరుడుడే.

పురాణాలలో గరుడారూఢుడై మహావిష్ణువు, అలాగే శ్రీకృష్ణుడు లోకోత్తరమయిన కృత్యాలతో ధర్మసంస్థాపన చేసిన వృత్తాంతాలున్నాయి. వీటిలో కాలనేమివధ, నరకాసురసంహారం, బాణాసుర గర్వమణచటంలాంటివి ఒకరకంకాగా, పారిజాతాప హరణం, కైలాసగమనం, ధ్రువునికి అనుగ్రహప్రదానం, గజేంద్రమోక్షంలాంటివి భక్తజనసంరక్షణార్థం చేపట్టినవి.

గరుత్మంతుని గొప్పతనాన్ని ముందుగా తెలిపినవాడు 'అనూరుడు'. తల్లి వినత తొందరపాటుతో ఒక అండాన్ని బద్దలు చేసింది. అనూరుడు పుట్టాడు. అతనికి కోపం వచ్చింది. కద్రువకు దాసివవుతావని శపించాడు. ఆ తరువాత తల్లితో అమ్మా! తొందరపడవద్దు, రెండవఅండం తనకుతానుగా 'అలియునంతవరకు' ఓపిక పట్టవమ్మా. పుట్టబోయేవాడు తమ్ముడు. అతడు సామాన్యుడు కాడమ్మా. మహాబలసంపన్నుడు. "నీ దాస్యాన్ని తొలగించేవాడు" అని చెప్పి సూర్యసారథిగా వెళ్ళిపోయాడు. అనూరుడు చెప్పినట్లే గరుడుడు పుట్టాడు. అతని రెక్కలు సామాన్యమయినవి కావు. ఆ రెక్కల గాలికి కొండలు, సముద్రము వణికిపోయాయి. పుట్టగానే ఆకాశానికి ఎగిరాడు. ఆపైన తల్లికి నమస్కరించాడు. తల్లి మాటప్రకారం కద్రువదగ్గరికి వెళ్లాడు. కద్రువ గరుత్మంతుని చూచి అసూయపడింది. వినతలాగే గరుత్మంతునిచేత ఊడిగాలు చేయించుకొంది. గరుత్మంతుడు ఈ వెట్టిచాకిరికి స్వస్తి పలకాలనుకొన్నాడు. నాగులను అడిగితే అమృతం తెచ్చిపెడితే దాస్యానికి విముక్తి అన్నారు.

గరుత్మంతుడు తల్లి అనుమతితో పరస్పరం కలహించుకొంటున్న 'గజకచ్ఛపాలను' ఆరగించి బలయుతుడై అమృతమున్న చోటుకి వెళ్ళాడు.

అమృతం చుట్టూ ఉన్న కాపలావారు గరుత్మంతుని దగ్గరికి రానివ్వలేదు. అయినా గరుడుడు పోరాడి వారిని సంహరించాడు. అమృతం చుట్టూ భగభగమండే అగ్నికీలలు. గరుత్మంతుడు ఆకాశానికెగిరి సమస్తనదీజలాలను నోటనింపుకుని అగ్నికీలలపై చల్లి శాంతింపజేశాడు.

అమృతం తిరుగుతున్న చక్రం మీద ఉంది. గరుడుడు సూక్ష్మదేహిగా చక్రం ఆకులమధ్య దూరాడు. చక్రం కిందికి చూస్తే అక్కడ భయంకరమయిన పాములు రెండు. గరుత్మంతుడు ఒక్కసారిగా రెక్కలు విదిల్చాడు. పరిసరమంతా దుమ్ముధూళితో నిండింది. సర్పాలకు కళ్ళుకనబడలేదు. ఇదే అదనుగా గరుడుడు ఆ సర్పాల పడగలను తొక్కిపడవేసి ఆకాశానికెగిరాడు. మహావిష్ణువు 'గరుడా! వరం కోరుకో' మంటే, హరిభక్తి చాలన్నాడు. వెన్నుడు సంతోషంతో తనకు వాహనంగా, ధ్వజంగా ఉండమని ఆదేశించాడు. అప్పటినుండి శ్రీధరుడు గరుడవాహనుడయ్యాడు. ఈ అమృతాపరహణం శ్రావణశుక్లపంచమినాడు జరగడంవల్ల ఈ తిథి ఆరాధ్యమయింది.

గరుడపంచమి ఆరాధన నేపాల్‌లో ఎక్కువ. ఆంధ్రదేశంలో కృష్ణాగోదావరీ ప్రాంతంలో మాత్రమే ఆచరింపబడుతూ ఉంది. నేపాల్‌లో మనిషిముఖం, గరుడుని రెక్కలున్న విగ్రహాలెక్కువ. అలాగే సర్పరాజుకు నమస్కరించే గరుడవిగ్రహాలు కనిపిస్తాయి. వీటికి సంబంధించి ఒక కథ ఆ ప్రాంతంలో వినబడుతుంది.

ఒకసారి గరుడునికి తక్షకునికి యుద్ధం జరిగింది. గరుడుడు విష్ణువు సహాయం కోరాడు. విష్ణువు సరేనన్నాడు. తక్షకుడు అవలోకితేశ్వరుని సాయం కోరాడు. అవలోకితేశ్వరుడు సరేనన్నాడు. తక్షకునికి గరుడునికి రాజీ కుదిర్చాడు. ఆ స్నేహానికి నిదర్శనంగా తక్షకున్ని గరుడుని మెడలో హారంగా వేశాడు. ఈ సంఘటన గరుడపంచమిరోజే జరిగింది.

కృష్ణాగోదావరి ప్రాంతాలలో ఈ పంచమిని స్త్రీలే ఆచరిస్తారు. ఆ స్త్రీలలో కూడా సోదరులు కలవారే అర్హులు. పవిత్రంగా స్త్రీలు స్నానం చేసి చతురస్రమండపం ఏర్పరచి పళ్ళతో



పూలతో అలంకరిస్తారు. పంచవర్ణముగ్గులు పెడతారు. మధ్య బియ్యం పోసి ఒక సర్పప్రతిమను ఉంచి షోడశోపచారాలతో అర్చిస్తారు. పడగమధ్యలో గౌరీబింబాన్ని ఉంచి పూజించి పదిముళ్ళు గల తోరాలతో అర్చించి వాటిని ధరిస్తారు. అతృప్తులయిన నాగులకు తృప్తి కలిగించి గరుడుని విజయానికి జయపతాకగా జరుపబడే పర్వదినమిది.

గరుడ శబ్దానికి చాల ఎక్కువ వ్యాప్తి ఉంది. తిరుమల కొండలలో ఒకటి గరుడాద్రి. వివాహాలలో మ్రోగించే గట్టి మేళం గరుడమేళం. నవరత్నాలలో ఒకటి గరుడమణి. హస్తరేఖలలో ఒకటి గరుడరేఖ. సమరవ్యూహాలలో ఒకటి గరుడవ్యూహం అంతేకాదు 'గరుడదర్శనం' పుణ్యప్రదం. వైష్ణవాలయాలలో గరుడసేవకు అత్యంతప్రాధాన్యం. స్తోత్రవాఙ్మయంలో గరుడ పంచాశత్, గరుడదండకాలు ప్రసిద్ధాలు. తమిళనాడులో నాచ్చియార్ కోవెలలో 'కల్‌గరుడసేవ' అత్యంత ఆకర్షకం.

గరుడపంచమిరోజు గరుడుని చరిత్ర ఆకర్ణించడం పుణ్యోపేతం. ఫలప్రదాయకం.

"కుంకుమాంకిత వర్ణాయ కుందేందు ధవళాయ చ

విష్ణువాహ నమస్తుభ్యం పక్షిరాజాయ తే నమః" 

తిరుమల క్షేత్రం - భక్తుల వృత్తాంతాలు


డా॥ సి. పద్మావతి, హైదరాబాదు, 9848914649

వేంకటాచలం

వేంకటాద్రి, వృషాద్రి, వృషభాద్రి, శేషశైలమనేపేరు ప్రసిద్ధిగల తిరుమలకు ఈ బ్రహ్మాండంలోనే అద్వితీయ స్థానమేర్పడింది. ఈ పర్వత పంక్తితో పోల్చదగిన దైవ సన్నిధానం ఇంకోటి ఉండదనటం అతిశయోక్తి కాదు. ఇంతటి పరమ పవిత్రమైన స్థానంలో స్వయంవ్యక్త మూర్తిగా అవిర్భవించిన శ్రీవేంకటేశ్వరుడు దేవదేవుడు. ఇంతకు ముందెప్పుడు ఇంతటి ప్రభావ సంపన్నుడైన దేవుడు అవతరించలేదు, ఇకముందు కూడా అవతరించడు అంటున్నది బ్రహ్మాండ పురాణం–

వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశసమో దేవో న భూతో న భవిష్యతి ॥

నిజమే, బ్రహ్మాండ పురాణం చెప్పిన మాట ఈనాడు అక్షర సత్యమనిపిస్తుంది. వేంకటాచల క్షేత్రం గురించి కాని, వేంకటేశ్వరస్వామిని గురించి గాని తెలియని మానవుడు ఈనాడు ప్రపంచంలో లేడనటం, ఆ స్వామి దివ్య ముఖారవింద దర్శనం కోసం ఆయన ముంగిట్లో బారులు తీరి నిల్చుంటున్నది ఎందుకని? ఆ స్వామి మహిమ అలాంటిది. ఆ క్షేత్ర మహిమ కూడా అలాంటిదే.



ఈ క్షేత్రానికి నాలుగు విధాల గొప్పతనం ఏర్పడింది. వరాహస్వామి ఈ పర్వతాన్ని శ్రీవైకుంఠం నుంచి భూలోకానికి తెప్పించడం వల్ల, ఇందులో స్వామి పుష్కరిణి ఉండటం వల్ల, ఎన్నో మహా మహిమాన్వితాలైన తీర్థాలెన్నో ఇందులో ఉండటంవల్ల, అలాగే సాక్షాత్తు భగవంతుడు శ్రీవైకుంఠాన్ని వదలి స్వయంవ్యక్తమూర్తిగా ఈ పర్వతంపై అవతరించడం వల్ల కలిగింది.

తిరుమలలో అవతరించిన స్వామిని ఏడు కొండలవాడు అంటారు. కలియుగ ప్రత్యక్షదైవం ఈ దేవుడని జగత్ప్రసిద్ధి. అందుకే అంటారు –

కృతే వరదరాజస్తు త్రేతాయాం రంగనాయకః।
ద్వాపరే తు జగన్నాథః కలౌ వేంకట నాయకః ॥

ఒక్కో యుగంలో ఒక్కొక్క దేవుడు ప్రధానంగా ఆరాధింపబడతాడు. కృతయుగంలో వరదరాజస్వామి, త్రేతా యుగంలో శ్రీరంగనాయకస్వామి, ద్వాపరంలో జగన్నాథుడు, కలియుగంలో ప్రత్యక్షదైవమైన వేంకటేశ్వరస్వామి ముఖ్యమైన ఆరాధ్య దైవాలని పెద్దలు చెబుతారు.

ఇంత ప్రసిద్ధి పొందిన "వేంకట" శబ్దానికి వ్యుత్పత్తినిలా చెబుతారు. వేం=పాపం, కటతి=దహతీతి "వేంకట". మానవుల పాపాలన్నింటిని దహించే శక్తి కలది కనుక ఈ పర్వతం వేంకట పర్వతమైంది. ఈ పర్వతాధి నాథుడు వేంకటేశ్వరుడైనాడు. ఇది ఈ శబ్దానికి వరాహపురాణం ఇచ్చిన వ్యుత్పత్తి –

వేంకారోఽ మృత బీజస్తు
కటమైశ్వర్య ముచ్యతే।
అమృతైశ్వర్య సంఘ త్వా
ద్వేంకటాద్రిరితి స్మృతః ॥

భవిష్యోత్తర పురాణం ఈ శబ్దాన్నిలా వ్యాఖ్యానిస్తున్నది –

సర్వ పాపాని 'వేం' ప్రాహుః
కటస్తద్దాహ ఉచ్యతే।

తస్మాద్వేంకట శైలోఽయం

లోకే విఖ్యాత కీర్తిమాన్॥

వరాహపురాణము 'వేం' కారము అమృత బీజమని 'కట' శబ్దం ఐశ్వర్యవాచకమని అమృతైశ్వర్య సమూహమనే అర్థంలో ఈ శబ్దం ప్రయోగింపబడిందని ఈ పురాణం భావిస్తున్నది.

భక్తుల వృత్తాంతాలు

వేంకటాచలంతోను శ్రీవేంకటేశ్వరునితోను సంబంధంకల భక్తుల వృత్తాంతాలు వేంకటాచల మాహాత్మ్యంలో ఎన్నో అభివర్ణింప బడ్డాయి.

శంఖణ మహారాజు



రాజ్య భ్రష్టుడైన శంఖణుని వృత్తాంతం వరాహ పురాణంలో ఈవిధంగా పేర్కొనబడింది.

పూర్వము చంద్ర వంశంలో శంఖణుడనే మహారాజుండేవాడు. అతను కొంతకాలానికి శత్రువుల చేత పరాజితుడై భార్యలతో, మంత్రులతో దేశబహిష్కృతుడైనాడు. తరువాత అతడు దక్షిణానగల సేతువును దర్శించి సువర్ణ ముఖరీ తీరానికి వచ్చి స్నానం చేసి తన దైన్యానికి దుఃఖిస్తుండగా అశరీరవాణి ఇలా పలికింది.

"ఈ ప్రాంతానికి ఉత్తరంలో వేంకటాద్రి అనే క్షేత్రం ఉంది. అక్కడ శ్రియఃపతి శ్రీనివాసుడై ఉన్నాడు. ఆయన సన్నిధిలో స్వామి పుష్కరిణి ఉంది. అందులో నీవు మూడు కాలాల్లోను స్నానం చేస్తే తిరిగి నీ రాజ్యం నీకు లభిస్తుంది". ఆ రాజు అశరీరవాణి నిర్దేశం ప్రకారం వేంకటాచలానికి చేరి నిత్యం స్వామి పుష్కరిణిలో స్నానం చేస్తూ ఆరునెలలు గడిపాడు. ఒక రోజు కోటి సూర్యప్రభా భాసురమైన ఒక దివ్య విమానం అతని ముందు నిలిచింది. ఆ విమానంలో పరాత్పరుడైన భగవంతుడు శ్రీ, భూ, నీళలతో కలసి ప్రత్యక్షమైనాడు. శంఖణుడు ఆయన్ను స్తుతించగా, స్వామి ఇలా అన్నాడు –

"ఓ రాజా! నీకు పూర్వపు స్వామిత్వం మరలా లభిస్తుంది. ఇది అంతా నీకు స్వామి పుష్కరిణీపై గల భక్తికి ఫలమే". తరువాత సామంతులు శంఖణుని రాజ్యాన్ని అతనికి అప్పగించారు. శంఖణుడు పోగొట్టుకున్న రాజ్యాన్ని పొంది సుఖంగా పరిపాలించాడు.

దశరథ మహారాజు

వరాహ పురాణం దశరథుని వృత్తాంతాన్ని కూడా ఇలా వివరిస్తున్నది.

అయోధ్యను రాజధానిగా జేసికొని ధర్మబద్ధముగా పరిపాలన సాగిస్తున్న దశరథుడు, చాలా కాలందాకా సంతానం లేక గురువైన వశిష్ఠుని కారణాన్ని వివరించమని కోరాడు. పుత్ర ప్రాప్తికి విరోధియైన పాపమేదో ఉన్నట్లు తోస్తున్నది. దక్షిణ దేశంలో సువర్ణ ముఖరీ తీరంలో గల వేంకటాచలానికి వెళ్ళి శ్రీనివాసుని సేవించి రమ్మని ఆదేశించాడు. దశరథుడు మార్గంలో ఉన్న సమస్త తీర్థాలలోను స్నానం చేసి వేంకటాద్రిని చేరి అక్కడ సుందరమైన స్వామి పుష్కరిణిని చూచి, అక్కడ కొంత కాలం తపస్సు చేస్తూ ఉన్నాడు. ఒకరోజు శ్రీనివాసుడు దివ్య విమానంలో ఆవిర్భవించి దశరథునికి వరప్రదానం చేశాడు. అందువల్లనే ఆయనకు పుత్రసంతానం కలిగిందని తెలుస్తున్నది.

వృద్ధ బ్రాహ్మణ వృత్తాంతం

వేంకటాచలంలో ఒకప్పుడు శ్రీనివాసుడు బాలుని రూపంలో సంచరిస్తున్నాడు. ఇంతలో ఒక వృద్ధుడు ఆ ప్రదేశానికి కౌండిన్యుడనే తన పుత్రుణ్ణి వెతుక్కొంటూ వచ్చి "కౌండిన్యా!" అని పిలిచాడు, శ్రీనివాసుడు "ఇక్కడ కౌండిన్యుడు కాదుగదా మానవమాత్రులెవ్వరు" లేరని చెప్పాడు. అప్పుడు ఆ వృద్ధుడు "సుదూరంలో ఉన్న ఆశ్రమానికి నేనెలా వెళ్తాను? శ్రౌతక్రియలను ఆచరించడానికి అశక్తుడనైన నన్ను ఆ బ్రహ్మదేవుడు ఎందుకు బ్రతికించాడు?" అని దుఃఖపడ్డాడు.

అప్పుడు శ్రీనివాసుడు వృద్ధునితో ఇలా అన్నాడు – "ఓ వృద్ధ బ్రాహ్మణుడా! నీకు కళ్లు కనబడటం లేదు. శరీరం శిథిలమైపోయినా ఇంకా ఎందుకు జీవించాలని అనుకొంటున్నావు? నిజంగా నువ్వు వైదికక్రియలను చెయ్యటానికి జీవించాలని అనుకుంటున్నావా?" అన్నాడు. దానికి ఆ వృద్ధుడు "నాకు జీవితంపై ఏ ఆశాలేదు, నేను యజ్ఞాలను ఆచరించక పోవటం చేత దేవతలకు ఋణపడి ఉన్నాను. అందువల్లనే ఈ శరీరం విడడానికి ఇష్టపడటంలే" దన్నాడు.

శ్రీనివాసుడు అతని చేయి పట్టుకొని కొంతదూరం నడిపించి ఒక తీర్థంలో స్నానం చేయించాడు. అందులో స్నానం చేసి పైకి లేచేసరికి ఆ వృద్ధుడు పదహారు సంవత్సరాల వాడైనాడు. వృద్ధుడు ఇక్కడ స్నానం చేసి కుమారుడైనాడు కాబట్టి దీనికి 'కుమార ధార' అనే ప్రసిద్ధి కలిగింది.

కుమారస్వామి

పద్మపురాణం కుమారస్వామి వృత్తాంతాన్ని ఇలా వివరిస్తున్నది. శంకరుడు కుమారస్వామిని సేనాధిపతిగా నియమించాడు. దాన్ని నిర్వహించలేక ఆయన సేనాధిపత్యాన్ని దక్కించుకోవాలని కుమారధారా తీర్థంలో మూడు కాలాల్లోను స్నానం చేస్తూ విష్ణువును అర్చిస్తూ తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చి విష్ణువు ప్రత్యక్షమై 'శక్తి' అనే ఆయుధాన్ని ఇచ్చాడు. కుమారస్వామి తపస్సు చేసిన ప్రాంతంలో ప్రవహించటం చేత దీనికి 'కుమారధార' అనే ప్రసిద్ధి ఏర్పడిందని ఈ పురాణం వివరిస్తున్నది.

పాండవ వృత్తాంతము

ఒకప్పుడు శ్రీకృష్ణుని ఆజ్ఞానుసారం పాండవులు వేంకటాచలానికి వచ్చి అక్కడ ఒక పుణ్యతీర్థంలో స్నానం చేస్తూ ఒక సంవత్సర కాలం తపస్సు చేశారు. ఒకనాడు ధర్మరాజుకు ఒక స్వప్నం వచ్చింది. అందులో "మీ పాపాలు నశించిపోయాయి. మీకు యుద్ధంలో విజయం కలిగి, మీరాజ్యం మీకు తిరిగి లభిస్తుంది" అని అశరీరవాణి పలికింది. పాండవులు అక్కడ స్నానం చేసి తపస్సు చేయడం చేత అది, 'పాండవ తీర్థ' మని ప్రసిద్ధి చెందింది.

దురాచార వృత్తాంతం

కావేరీ తీరంలో దురాచారుడనే బ్రాహ్మణుడుండేవాడు. అతను మహాపాతకులతో కలసి ఉండటంచేత, బ్రాహ్మణత్వం నశించి పోయింది. సకల దోష నిదాన భూతుడవటంచేత ఆదురాచారుణ్ణి ఒక భేతాళుడు పట్టుకొన్నాడు. భేతాళ బాధితుడై అతను అన్ని దేశాలు తిరుగుతూ దైవయోగం వల్ల వేంకటాద్రి చేరి అక్కడ ఉన్న జాబాలి తీర్థంలో స్నానం చేసేటప్పటికి భేతాళుడు అతణ్ణి వదలి పెట్టాడు. భేతాళుడికి కూడా భేతాళత్వం నశించి పోయింది. ఈ తీర్థం స్నానమహిమ చేత అతనికి విష్ణులోకం లభించింది.

దృఢమతి వృత్తాంతం

హిమాలయాలకు ప్రక్కన బ్రహ్మాశ్రమం ఉంది. ఒకప్పుడు దృఢమతి అనే వాడు ఆ ఆశ్రమానికి వచ్చాడు. అక్కడ కులపతికి యజ్ఞం చేయడానికి అనుమతివ్వమని అడిగాడు. ఆ కులపతి నీవు యాగం చేయవద్దు, కొంతకాలం శుశ్రూష చేయమన్నాడు. తరువాత దృఢమతి నిరాశపడి అక్కడ నుంచి కొంతదూరం వెళ్లాడు. అక్కడ సుమతితో దృఢమతికి స్నేహమేర్పడింది. సుమతి దృఢమతికి హవ్యకవ్యశ్రాద్ధ ప్రక్రియ కూడా నేర్పాడు.

దృఢమతి చేత పోషింపబడు సుమతిని, మరణానంతరం యమభటులు నరకానికి తీసుకువెళ్లారు. కల్పకోటి సహస్ర సంవత్సరములు నరకయాతనలను అనుభవించి తిరిగి గాడిదగా, పందిగా, కుక్కగా అనేక నీచ జన్మలెత్తాడు. తరువాత ఉత్తమ జన్మలు పొందాడు.

ఒకనాడు అడవిలో వెళుతుండగా అతణ్ణి బ్రహ్మరాక్షసి పట్టుకొన్నది. అతని తండ్రి అగస్త్యుణ్ణి ప్రార్థించగా, అగస్త్యుడు అతని పూర్వ వృత్తాంతాన్ని వివరించి, వేంకటాచలంలో ఉన్న స్వామి పుష్కరిణిలో స్నానం చేయించమన్నాడు. అతడలాగే చేయగా బ్రహ్మరాక్షసి విడచిపెట్టింది. అలాగే దృఢమతి కూడ పాపనాశన తీర్థాన్ని పైన చల్లుకొన్న వెంటనే దివ్య దేహాన్ని పొంది విమానంపైన స్వర్గానికి వెళ్లాడు.

పుణ్యశీల వృత్తాంతం

పూర్వం పుణ్యశీలుడనే బ్రాహ్మణుడు గోదావరీ తీరంలో ఉండేవాడు. అతడు ఒకప్పుడు శ్రోత్రియుడైన బ్రాహ్మణ్ణి నియోగించి పితృశ్రాద్ధం ఆచరించాడు. తరువాత అతనికి గాడిద ముఖం ఏర్పడింది. దానికి కారణాన్ని అడగ్గా అగస్త్యుణ్ణి శ్రాద్ధకర్మలో బిడ్డలు లేనటువంటి వాడిని నియోగించినందువల్ల ఇలా జరిగిందని, నీవు వేంకటా చలంలో ఉన్న ఆకాశగంగా తీర్థంలో స్నానం చేస్తే ఈ రూపం తొలగిపోతుందన్నాడు. అతడు అలాగే చేసి గాడిద ముఖాన్ని పోగొట్టుకున్నాడు.



పద్మనాభ వృత్తాంతం

స్కాందపురాణంలో పద్మనాభ వృత్తాంతం ఇలా చెప్పబడింది - పూర్వం తుంగభద్రాతీరంలో 'వేదాద్వ' మనే గ్రామంలో పద్మనాభుడనే పండితునికి కేశవుడనే కుమారుడున్నాడు. అతను వివాహం చేసికొని కూడ వేశ్యపైన ఆసక్తితో ఉండేవాడు. వేశ్యకోసం దొంగతనం చేసి ఆ డబ్బును ఆమెకు సమర్పిస్తుండేవాడు. ఒకనాడు ఒక బ్రాహ్మణుని ఇంట్లో దొంగతనం చేసి అతనిని సంహరించాడు. అందువల్ల అతణ్ణి బ్రహ్మరాక్షసి పట్టుకొన్నది. దాని బాధను భరించలేక తండ్రిని ఆశ్రయించగా అతను భరద్వాజుని ఆజ్ఞచేత కొడుకును తిరుమలలో ఉన్న కటాహతీర్థంలో స్నానం చేయించాడు. తరువాత బ్రహ్మరాక్షసి వదలిపోయింది.

ఆకాశరాజు వృత్తాంతం

ఇరవై ఎనిమిదో కలియుగంలో పాండ్యకన్యయైన మనోరమకు, మిత్రవర్మకు కలిగిన సత్సంతానమే ఆకాశరాజు. అతని భార్య శకవంశ సంజాతయైన ధరణీదేవి. ఆకాశరాజు యజ్ఞం కోసం కర్షణం చేస్తుండగా అతనికి ఆరణీనదీ తీరంలో పద్మావతీ దేవి లభించిందని, తరువాత వసుధనుడనే పుత్రుడు కూడా కలిగాడని తెలుస్తున్నది.

ఆకాశరాజు పద్మావతీదేవి ఇష్టాన్ననుసరించి వేంకటపతి శ్రీనివాసునకు పద్మావతినిచ్చి వివాహం చేశాడు. అంత్య ఘడియల్లో శ్రీనివాసుడు ఆకాశరాజుకు సాయుజ్యాన్నిచ్చాడు.

వసువృత్తాంతం

వసువు అనేవాడు నిషాదుడు. అతడు విష్ణుభక్తి పరాయణుడై శ్యామకాలను వండి తేనెతో కలిపి శ్రీమహావిష్ణువుకు అర్పిస్తుండేవాడు. అతనికి చిత్రవతి అనే భార్య, వీరుడనే కుమారుడు ఉన్నారు. వసువు చిత్రవతులు తేనెను తీసుకు రావడానికి అడవికి వెడుతూ కుమారుని ఇంటి దగ్గర ఉంచాడు. వీరుడు శ్యామకాలను వండి భక్తితో స్వామికి పెట్టగా శ్రీనివాసుడు అతని భక్తికి సంతసించి వాటిని భక్షించాడు. వసువు చిత్రవతులు దీనిని విని వీరుడు అసత్యమాడుతున్నాడని అతనిని కత్తితో చంపబోగా శ్రీనివాసుడు ఇలా అన్నాడు–

నీకంటె నీకుమారుడు భక్తుడు. అందుకే అతనికి ప్రత్యక్షమయ్యానని, నీకు పుష్కరిణీతీరంలోనే కనపడతాను, అతనికి అంతట కనపడతాను అన్నాడు.

రంగదాస వృత్తాంతం

తొండమానుని పూర్వజన్మ రంగదాసు. ఇతడు బాల్యంలోనే వేంకటాద్రినిచేరి శ్రీనివాసమూర్తిచుట్టూ రాతిగోడలను కట్టి, దేవాలయానికి ప్రక్కన బావి నొక దానిని త్రవ్వి, తోటలను పెంచి పుష్పాలతో స్వామిని అర్చించేవాడు. ఒకనాడు రంగదాసు స్నానసమయంలో సరస్సులో జలక్రీడలాడుతున్న గంధర్వుని అతని భార్యలనుచూసి మైమరచి పూలను కోయడంలో అలస్యం చేసి స్వామి ముందు తలవంచుకొన్నాడు.

అప్పుడు శ్రీ వేంకటేశ్వరుడు నీవు కూడా రాబోయే జన్మలో గంధర్వరాజు వలె మహారాజుగా పుట్టి నాకు విమానాన్ని నిర్మించి ఎంతో కైంకర్యం చేయగలవని చెప్పాడు. ఇలా రంగదాసు నూరు సంవత్సరాలు స్వామికి సేవచేసి తిరిగి తొండమానుడుగా జన్మించాడని శ్రీవేంకటాచలమాహాత్మ్యం ద్వారా తెలుస్తున్నది.

తొండమాన్ వృత్తాంతం

శ్రీవేంకటేశ్వరునికి కైంకర్యం చేసిన రాజులలో తొండమాన్ చక్రవర్తి సుప్రసిద్ధుడు. పూర్వజన్మలో రంగదాసే తొండమానునిగా చంద్రవంశంలో జన్మించాడు. ఇతడు పాండ్యరాజు కూతురు పద్మను వివాహమాడి నారాయణపురం రాజధానిగా రాజ్యం చేసేవాడు. రేణుకాదేవిని తిరుమలలో ఆరాధించి ఆమె అనుగ్రహంతో శ్రీనివాసుని నివాసాన్ని కనుక్కొన్నాడు. వేంకటాద్రిలో మొట్టమొదట శ్రీనివాసునికి ఆలయగోపుర ప్రాకారాలను నిర్మించి, మహోత్సవాన్ని తొండమానుడే నిర్వహించాడు. తరువాత ఇంకొక రూపాన్ని ధరించి సారూప్య మోక్షాన్ని పొందినట్లు పురాణాలు తెలియజేస్తున్నాయి.



భీమవృత్తాంతం

భీముడనే కుమ్మరి భక్తుడు ప్రతి నిత్యం శ్రీనివాసుని మట్టి పద్మాలతో ఆరాధిస్తూ ఉండేవాడు. ఒకనాడు శ్రీనివాసుడు తొండమానునికి ఈ విషయాన్ని చెప్పాడు. అదివిని తొండమానుడు భీముని దర్శించడానికి ఆయన ఇంటికి వెళ్ళాడు. శ్రీనివాసుడు అక్కడ ప్రత్యక్షమై అతనికి, అతని భార్య తమాలినికి సాయుజ్యాన్నిచ్చాడు.

వకుళమాలికా వృత్తాంతం

వరాహస్వామి శ్రీనివాసునికి పాకాదికైంకర్యం కోసం వకుళమాలికను నియోగించాడు.

శ్రీ కృష్ణావతారంలో యశోద భగవానుని ఈవిధంగా ప్రార్థించింది – “కృష్ణా! నీ కల్యాణాన్ని కన్నులారాచూసే భాగ్యం నాకు లేకపోయింది గదా! దాన్ని అనుగ్రహించు” అని అడుగగా దానికి కృష్ణుడు – “అమ్మా కొద్దికాలం తర్వాత నీ కోర్కెను తీరుస్తాను” అని వరమిచ్చాడు. ఆ వరాన్ననుసరించి భగవంతుడు శ్రీనివాసుడై అవతరించగా యశోదయే వకుళమాలికగా జన్మించి శ్రీనివాసుని కల్యాణాన్ని జరిపించింది.

ఇలా వేంకటాచలంలో ఎందరో భక్తులు తమ కష్టాలను పోగొట్టుకొని స్వామి సేవలో తమ జీవితాన్ని చరితార్థం చేసుకొన్నారని పురాణాలు వివరిస్తున్నాయి. 



శ్రీవారి ఆలయంలో ఉన్నప్పుడు
మౌనంగా మనస్సులో
‘ఓం శ్రీవేంకటేశాయ నమః’
అని ధ్యానించుకోండి.

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్ పరం బ్రహ్మ తస్మైశ్రీ గురవే నమః ॥



ఆచార్య జానమద్ది రామకృష్ణ, తిరుపతి, 9849020208

అజ్ఞానతిమిరాంధస్య జ్ఞానాంజనశలాకయా !
చక్షురున్మీలితం యేన తస్మై శ్రీగురవే నమః !!

అజ్ఞానమనే చీకటి అవరించిన కారణంగా శిష్యుడు అంధునివలె ప్రపంచతత్త్వం తెలిసికోలేకపోతున్నాడు. ఆ శిష్యుడినెలాగయినాఉద్ధరించాలనే సంకల్పం కలిగింది గురువుకు. అంతే, జ్ఞానమనే కాటుకతో దృష్టిని ప్రసాదించాడు. దీని కారణంగా శిష్యునికి సమస్తమూ కనిపిస్తోంది. ఇంతటి మహత్త్వం కలిగిన గురుదేవులకు నా నమస్కారము అని పై శ్లోకం భావం.

గురువంటే ఎవరు?

పరోపకారభావన, జపపూజాదుల అచరణ, సార్థకమైన పలుకు, శాంత స్వభావం, వేద వేదాంగాలు క్షుణ్ణంగా తెలిసిఉండటం, యోగశాస్త్ర సిద్ధాంతాలను సులువుగ బోధించగలగటం, దేవతల మనస్సులను సంతోషపెట్టడం, మొదలైన సుగుణాలతో పరిపూర్ణుడైనవాడే గురువు. ఇంతేకాదు, సకల శాస్త్ర జ్ఞానము, సర్వవిధసామర్థ్యము, మంచి మాటకారి తనము, చక్కని తేజస్సు, దానగుణము, పరిశుద్ధమైన మనస్సు, పృథివి ఇత్యాది పంచభూతాలతత్త్వం ఎరిగియుండుట మొదలైన లక్షణాలు కలిగిన వ్యక్తి "సద్గురువు".

జూలై 31 గురుపూర్ణిమ

స్వయమాచరతే శిష్యానాచారే స్థాపయత్యపి !
ఆచినోతి హి శాస్త్రార్థానాచార్యస్తేన కథ్యతే !!

ప్రపంచంలో అన్నిటికంటె తేలికైన పని ఏదంటే, ఇతరులకుపదేశించడం. దీన్ని అందరు చేయగలరు. అలాకాకుండ తాను పదిమందికి చెప్పదలచిన నీతిని ముందుగా తానాచరించాలి. ఆ తరువాతే పరులకుపదేశించాలి. ఇలాంటి మహానుభావుడే గురువు. ఇతన్నే ఆచార్యుడనీ వ్యవహరిస్తారు.

గురుమాహాత్మ్యం

గురురేకః శివస్సాక్షాత్ గురుస్సర్వార్థసాధకః !
గురురేవ పరంతత్త్వం సర్వం గురుమయం జగత్ !!

గురురేకో వరారోహే! పాపం నాశయతి క్షణాత్ !
గురుం వినా యతస్తంత్రే నాధికారః కథఞ్చన !!
అత ఏవ ప్రయత్నేన గురుః కర్తవ్య ఉత్తమః ॥

సాక్షాత్తు శివస్వరూపుడు, ఏ కార్యాన్ని సాధించాలన్నా సాధనంలాంటివాడు గురువు. ప్రపంచంలోని అన్ని తత్త్వాలకంటే శ్రేష్ఠమైంది గురుత్వం. ఈ లోకమంతా గురుమయమే. మనంచేసిన పాపాలను క్షణకాలంలో దూరంచేయగలిగిన శక్తిమంతుడు ఒక్క గురువు మాత్రమే. ఏ శాస్త్రాన్నయినా క్షుణ్ణంగా అధ్యయనం చేయాలంటే తప్పనిసరిగ గురువుకావాలి. గురువులేని విద్య గుడ్డివిద్య. ఇన్ని లక్షణాలతనిలో ఉంటాయి కనుకనే మంచి గురువునన్వేషించాలి.

గురువునెలా భావనచేయాలి?

ఈ విషయమై మహేశ్వరుడు పార్వతిదేవితో ఇలా అన్నాడు –

దేవతా గురు మంత్రాణామైక్యం సంభావయన్ ధియా ।
తదా సిద్ధో భవేన్మంత్రః ప్రకటే హానిరేవ చ ॥

గురువు ఏదేని దేవతకు సంబంధించిన మంత్రాన్ని శిష్యునికుపదేశం చేస్తాడు. ఆ మంత్రసిద్ధి కలగాలంటే దేవత, గురువు, మంత్రం ఈ మూడింటియందు ఐక్య భావనకలగాలి. ఈ మూడు పరస్పరం వేరు. ఒకదానితో ఒకటి సంబంధించవనే భేదభావనే గనుక ఉంటే ఆ మంత్రం సిద్ధించదని భావం. అపుడు పార్వతీ దేవి అడిగింది –

ఐక్యజ్ఞానం మహాదేవ! కథముత్పద్యతే ప్రభో!
నరాకృతిం గురుం మన్యే దేవతా ధ్యానరూపిణీ।
మంత్రశ్చాక్షరరూపో హి కథమైక్యం భవేచ్ఛివ॥

ప్రభూ! గురువు మానవరూపుడు. ధ్యానరూపి దేవత. మంత్రమేమో అక్షరరూపంతో ఉంటుంది కదా! మరి పరస్పరం విరుద్ధ రూపాలతో ఈ మూడింటియందు ఐక్యభావన ఎలా కలుగుతుంది? అపుడు శివుడన్నాడు –

గురోర్జాతశ్చ మంత్రశ్చ మంత్రాజ్జాతా తు దేవతా।
అత ఏవ వరారోహే దేవతాయాః పితామహః॥

తాత–తండ్రి–కొడుకు ఈ ముగ్గురు రూపాలలో వేరైనా ఈ ముగ్గురులో మూలమైనవాడు తాత. అదే విధంగా గురువునుండి వచ్చేది మంత్రం. ఆ మంత్రమూలంగా సిద్ధించేది దేవత. ఈ దృష్టితో ఆలోచించినపుడు ఐక్యభావనకలగడం కష్టమేమీకాదు.

ఎవరైతే పైమూడింటిని భేదదృష్టితోగాక సమానదృష్టితో చూడగలుగుతారో అలాంటి వారి ప్రతికోరికనూ ప్రకృతి తీర్చగలదని భావం. 'గురు' శబ్దంలో గకారం, రేఫ, ఉకారమనే మూడు వర్ణాలున్నాయి. వీటిలో 'గ' కారం సిద్ధిప్రదాయకం, రేఫ పాపహారకం, 'ఉ' కారం శివస్వరూపం కాగా 'గురు' అనే శబ్దాన్ని ఉచ్చరిస్తే కోరికలు సిద్ధించడం, పాపాలు హరించడం, శివానుగ్రహ మనే మూడు ఫలితాలు ఒకే సమయంలో దక్కుతాయి. ఇదీ గురు శబ్దోచ్చారణమాహాత్మ్యం.



గురువుయొక్క అధిక్యము

గురువును మించిన శాస్త్రం, గురువును మించిన తపస్సు, గురువును మించిన మంత్రం, గురువుకంటె మిన్నయైన ప్రయోజనమేదీలేదు. నిత్యము గురుమూర్తిని ధ్యానించడం, గురుతత్త్వం జపించడం అలవరుచుకోవాలి. గురువు నివసించే ప్రదేశమే కాశీక్షేత్రము. గురుపాదోదకమే గంగానది. గురువు విశ్వేశ్వరుడు. గురుమంత్రమే తారకమంత్రము.

గురువులెన్ని విధాలుగుంటారు?

ప్రేరకస్సూచకశ్చైవ వాచకో ధర్మకస్తథా।
శిక్షకో బోధకశ్చేతి షడేతే గురవః స్మృతాః॥

1. ధార్మిక విషయాలపట్ల ప్రేరణఇచ్చేవాడు 2. పండంటి జీవితానికీ చక్కని సలహాలిచ్చేవాడు 3. చదివింపజేసేవాడు 4. బ్రహ్మసాక్షాత్కారం కలుగజేసేవాడు 5. చదువు చెప్పేవాడు 6. అమూల్యమైన హితవచనాలు పలికేవాడు అని గురువు ఆరువిధాలుగ ఉంటారు. ఈ ఆరు లక్షణాలు ఒకప్పుడు ఒకే వ్యక్తిలోనూ ఉండవచ్చును. అలాంటి మహానుభావుణ్ణి గురువుగ పొందగలిగిన వ్యక్తి ధన్యజీవి. ఏ కొందరికోగాని ఈ భాగ్యం కలుగదు.

ఉత్తమ గురువెవరు?

"గురువు" అని పేరు పెట్టుకొని తమ శిష్యుల సంపదలన్నిటినీ కొల్లగొట్టే వారెందరో ఉన్నారు. ముఖ్యంగా ఈ రోజు ఇలాంటి వేషగాళ్ళెందరో మనకు కనిపిస్తారు, వీరు కాదు గురువులు. శిష్యుల హృదయతాపాన్ని దూరం చేయగలిగినవారే నిజమైన గురువులు. అంటే శిష్యుల సంపద మీద దృష్టిసారించక వారికాధ్యాత్మిక విషయాలను సులువుగ తెలియపరచి బ్రహ్మసాయుజ్యానికి తోడ్పడేవాడే ఉత్తమ గురువు.

శిష్యుడెలా ఉండాలి?

ఉత్తమ వంశంలో పుట్టుక, పరిశుద్ధమైన మనసు, ధర్మార్థకామ మోక్షాలనే పురుషార్థాల విషయంలో ఆసక్తి కలిగిఉండటం. చక్కని అధ్యయనం, బుద్ధికుశలత, సకల ప్రాణుల హితంకోరగలగడం, ఆస్తిక భావాలుండటం, తన ధర్మం వదలకుండుట, తల్లిదండ్రుల కోసం శ్రమించే స్వభావం, త్రికరణశుద్ధిగ గురుసేవయే పరమలక్ష్యంగా కలిగిఉండడమనే ఈ శుభలక్షణాలన్నీ ఉన్నవాడే శిష్యుడని అనిపించుకుంటాడు.

గురుపాదులను స్మరిస్తూ గురుదేవుల పాదారవిన్దాలకు ప్రణమిల్లి గురుతత్త్వాన్ని బాగా జీర్ణంచేసుకొని, గురుమంత్రం జపించే వాడు కృతార్థుడు, ధన్యుడు మరియు పండితుడు. ఈవిధంగా చేయడంవల్ల సకల శాస్త్ర సిద్ధాంతాలను సులువుగ తెలిసికోగలడు.

గురుగృహవాసఫలం

ఏ శిష్యుడైతే గురువుగారింట్లో నివాసం చేస్తూ పుణ్యకార్యాలు చేస్తుంటాడో అలాంటి వాని పుణ్యమెప్పుడూ తరగదు. కొన్నివందల పుణ్యక్షేత్రాలు దర్శించినా లభ్యంకాని పుణ్యం దీనివల్ల లభిస్తుంది.

గురువుకు 'దేశికుడు' అనే పర్యాయపదముంది. చక్కని అర్థాన్ని బోధించే పదమిది. 'దే' దేవతారూపం ధరించినందు వల్లనూ, 'శి' శిష్యానుగ్రహబుద్ధి కారణంగానూ, 'క' కరుణామయమూర్తి కావడంచేతనూ 'దేశికుడు' అనే పదం సార్థకమైంది.

గురువులనెలా దర్శించాలి?

గురువుల దర్శనార్థం వెళ్ళినపుడు ఏవిధమైన ఆడంబరాలతో వెళ్ళరాదు. గురుదేవుల ఇంటికెళ్ళేటపుడు ప్రశాంతచిత్తం, భక్తి భావం కలిగిఉండాలి. వాహనాలు, పాదరక్షలు, ఛత్ర చామరాదులు మొదలైన వాటిని దూరంగా ఉంచాలి. తాంబూలం సేవిస్తూ వెళ్ళకూడదు. వేగంగా అడుగులేయక నెమ్మదిగ నడుస్తూ వెళ్ళాలి. ఇంతేకాదు రాజదర్శనం, దైవదర్శనం, గురుదర్శనం కోసమై వెళ్ళేటపుడు వట్టిచేతులతో వెళ్ళకూడదు. తన శక్తికొద్దీ పండ్లు, పూలు, మరియు వస్త్రాలతో వెళ్ళి దర్శనం చేసుకోవాలి.

బ్రహ్మానంద స్వరూపుడు, శాశ్వత సుఖప్రదాత, జ్ఞానస్వరూపుడు, శీతోష్ణ సుఖదుఃఖ రాగద్వేషాదులకు వశంకానివాడు, ఆకాశమంత విశాలమైనవాడు 'తత్త్వమసి' మొదలైన ఉపనిషద్వాక్యాలకు ఉదాహరణమైనవాడు, ఏకం, నిత్యం, పరిశుద్ధం, నిశ్చలమైన స్వరూపం గలవాడు, సమస్త కార్యాలకు సాక్షీభూతుడు, సకలభావాలకతీతుడు, సత్త్వరజస్తమో గుణాలేవీ లేని నిర్గుణ స్వరూపుడును అయినటువంటి సద్గురువులను నమస్కరిస్తున్నాను.

కాయా, వాచా, మనసా ఎవరైతే సర్వదా గురువులను ధ్యానంచేస్తారో అటువంటి వారందరికీ శ్రీగురుదేవుల పాదపద్మములందు తప్పకుండ చోటు లభిస్తుంది. ఈ విధంగా నిత్యుడు, పరిశుద్ధుడు, నిరాకారుడు, నిరంజనుడు, చిదానందుడు, బ్రహ్మరూపుడైన గురుదేవులను సవినయంగా ప్రణమిల్లుతున్నాను. 

తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి జ్యేష్ఠాభిషేక మహోత్సవము

26-7-2015	ఆది	జ్యేష్ఠాభిషేక ప్రారంభం	ఆషాఢమాసమున జ్యేష్ఠానక్షత్రమున జరుగును.
27-7-2015	సోమ	కవచ ప్రతిష్ఠ	
28-7-2015	మంగళ	కవచ సమర్పణ	

తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివార్ల పవిత్రోత్సవ క్రమము

27-7-2015	సోమ	--	అంకురార్పణ (రాత్రి)
28-7-2015	మంగళ	పంచమూర్తులకు స్నపన తిరుమంజనం	సా॥ పవిత్రమండల పూజ, హోమములు
29-7-2015	బుధ	గ్రంథి పవిత్ర సమర్పణ, వ్రతచరి	సా॥ పవిత్ర ప్రతిష్ఠ, వ్రతచరి
30-7-2015	గురు	పట్టుపవిత్ర సమర్పణ, పవిత్రోత్సవ సమాప్తి	పంచమూర్తుల వీధి ఉత్సవం

పుష్కరాలు - మన కర్తవ్యం


శ్రీ సన్నిధానం లక్ష్మీనారాయణమూర్తి, హైదరాబాదు

భారతీయులమైన మనం తరతరాల నుంచి ఏదో ఒకధర్మమార్గాన్ని అనుసరించి జీవనం సాగిస్తున్నాం. ఇలా ధార్మికజీవనం చేసే మనకు ఈగోదావరి పుష్కరం ఒక సువర్ణావకాశం. ఇది 12 సంవత్సరాలకొకసారి సంభవించే పవిత్ర సన్నివేశం. అన్ని శ్రేయస్సులకు ధర్మమే సాధనమని, కనుక దాన్ని సాధించాలని అన్ని వేదాలు, శాస్త్రాలు ఉపదేశిస్తున్నాయి.

ధర్మాచరణం వల్ల మిగతా సమయాల్లో సిద్ధించే ప్రయోజనంకన్నా విశిష్టసమయాల్లో ఎక్కువ ప్రయోజనాలు కలుగుతుంటాయి. నిత్యం మనం చేసే స్నానం, దానం, దేవతార్చన మొదలైనవి, పుష్కరాలవంటి పర్వకాలాలలో వందలరెట్లు ఫలితాన్ని ఇవ్వగలుగుతాయి. ఔషధం ఒకటే అయినా ఋతుభేదం వల్ల అనుపానభేదం వల్ల విశిష్ట ప్రయోజనాన్ని కల్గించడం మనకు తెలియని విషయం కాదు.

పుష్కర వృత్తాంతం

బృహస్పతి ఒక్కొక్క రాశిలో ప్రవేశించినప్పుడు ఒక్కొక్కనదికి పుష్కరం వస్తుంది. పూర్వం తుందిలుడనే మహర్షి ఉండేవాడు. ఆయన చాల కాలం పరమేశ్వరుణ్ణి ఆరాధించాడు. ఆయన దయవల్ల మూడున్నర కోట్ల పుణ్యతీర్థాలకు రాజై పుష్కరుడు అనే ప్రసిద్ధి సంపాదించాడు. ఈశ్వరుని అష్టమూర్తులలో ఒకటైన జలమయామూర్తిలో ప్రవేశించి ఈశ్వరుడే అయినాడు. ఇలా ఉండగా ఒకప్పుడు బ్రహ్మ తన తపస్సుతో పరమేశ్వరుణ్ణి సంతోషింప చేసి అన్ని కోరికలను తీర్చే పుష్కరుణ్ణి సృష్టికార్యం కోసం తనకిమ్మని అడిగాడు. అలాగే అన్నాడు ఈశ్వరుడు. జలరూపంలో ఉన్న పుష్కరుణ్ణి తన కమండలంలో పెట్టుకొని బ్రహ్మ సృష్టిచేస్తున్నాడు.



జూలై 14 నుండి 25 వరకు గోదావరి పుష్కరాలు

ఇంకొంత కాలానికి బృహస్పతి బ్రహ్మను మెప్పించి పుష్కరుడు తనకు కావాలని కోరుకున్నాడు. సరేనన్నాడు బ్రహ్మ. కాని పుష్కరుడు బ్రహ్మను వదలి వెళ్ళడానికిష్టపడలేదు. ఎట్లాగో ఒక ఒప్పందం కుదిరింది. దాని ప్రకారంబృహస్పతి కొత్తగా ఒక రాశిలో ప్రవేశించినపుడు మొదటి 12 రోజులు, చివరి 12 రోజులు మిగతా రోజుల్లో మధ్యాహ్నం 4 ఘడియలు మాత్రం పుష్కరుడు బృహస్పతి ఆధీనంలో ఉండాలి. ఆ సమయంలో దేవగణాలందరితో బ్రహ్మ పుష్కరుణ్ణి అనుసరించాలి. ఈ ఒప్పందంప్రకారం పై చెప్పిన పుష్కరం కాలాల్లో 50లక్షల పుణ్యతీర్థాలకు అధిపతి అయిన పుష్కరుడు బ్రహ్మ మొదలైన దేవతలందరితో ఆయానదుల్లో బృహస్పతితో కలిసి నివసిస్తాడు. కాబట్టే ఆ నదుల్లో దేవతలందరి సాన్నిధ్యంవల్ల చెప్పలేనంత ప్రభావముంటుంది. అప్పుడు ఆచరించిన స్నాన, తర్పణాది కర్మలన్నింటివల్ల మనకెంతో పుణ్యం కల్గుతుంది.

పుష్కరస్నానం

ఈ పుష్కర సమయంలో అందరూ స్నానాన్ని దానాన్ని ఆచరించవచ్చు. ఎన్నో పుణ్యకార్యాలు ఈ సమయంలో చేయాలని శాస్త్రాలు చెపుతున్నాయి. కాని వాటన్నింటిలోకి ముఖ్యమైంది ఎంతో ఫలితాన్నివ్వగలిగింది పుష్కరస్నానం. నదులు దేవ, అర్ష, మానవ, అసుర భేదంతో నాలుగురకాలు అని బ్రహ్మపురాణం చెబుతున్నది. త్రిమూర్తుల చేత ప్రవర్తింప చేయబడేవి మొదటి తరగతికి చెందుతాయి. అలా మొదటి తరగతికి చెందిన గంగ, కృష్ణవేణి మొదలైన వాటితో గోదావరి కూడా పరిగణింపబడింది. సహజంగా ఇలాంటి గొప్ప ప్రభావం కలిగి పుష్కరకాలంలో మూడున్నర కోట్ల పుణ్యతీర్థాలతో ప్రకాశించే గోదావరిలో స్నానం చేయడం ఎంతో శ్రేష్ఠం.

నీళ్ళల్లో రెండురకాల శక్తులున్నాయని వేదం చెప్తుంది. మురికిని పోగొట్టడం, దాహాన్ని తీర్చడం అనే లౌకికశక్తి అందరికి తెలిసిందే. ఇంకా అతీంద్రియమైన దైవికశక్తి కూడా ఒకటివుంది. అది 'మేధ్యం' 'యజ్ఞం' అనే శక్తి ప్రోక్షణాదుల ద్వారా ద్రవ్య శుద్ధిని కలిగిస్తుంది. ఈ రెండూ కంటికి కనబడేవి కావు. ఆ ఫలితం కలగడానికి అలాంటి భావన ముఖ్యం. పుష్కర సమయంలో గోదావరిలో స్నానం చేస్తే, గంగ కృష్ణానది మొదలైన నదుల్లో 12 సంవత్సరాలు ప్రతి రోజు స్నానం చేసిన ఫలితం కలుగుతుందని, పూర్వజన్మల్లో మనస్సు, వాక్కు, శరీరమనే త్రికరణాలతో చేసిన అన్ని పాపాలు నశించి మోక్షప్రాప్తి కలుగుతుందని బ్రహ్మాండపురాణం చెప్తున్నది. అంతేకాదు చాలా శ్రమపడి చేయవలసిన అశ్వమేధ యాగం కంటే ఎక్కువఫలితాన్ని ఈ పుష్కర స్నానం మనకిస్తుందని విశ్వాసం. ఇంకా నర్మదా తీరంలో తపస్సు, కురుక్షేత్రంలో దానం, కాశిలో మరణం ఈ మూడు మోక్షాన్నిస్తాయని, పుష్కరకాలంలో పుష్కర స్నానం చేయడం పై మూడింటి వల్ల కలిగే ఫలితం కలుగుతుందని పద్మపురాణం పేర్కొన్నది.

పుష్కరసమయంలో ప్రాతఃకాలస్నానం ఉత్తమమైందని, మధ్యాహ్న స్నానం మధ్యమమని, అపరాహ్ణస్నానం అధమమైందని శాస్త్రాలు చెప్తున్నాయి. అవకాశమున్న వారు పుష్కరవిధిని ఆచరించడానికి ముందురోజే రెండుపూటలలో, ఒకపూటో ఉపవాసం చేసి మరుసటిరోజు ఉదయం ముండనం చేయించుకొని స్నాన, దాన, శ్రాద్ధతర్పణాదులను ఆచరించడం ఉత్తమం. స్నానం చేసిన తర్వాత స్నానఫలం సిద్ధించడానికి గోదావరి తీర్థరాజ, బృహస్పతి – బ్రహ్మ – విష్ణు – మహేశ్వర – ఇంద్రాది దేవతలకు అర్ఘ్యప్రదానం చేసి అటు తర్వాత ధర్మార్ఘ్యాలు ఇవ్వమని, బ్రాహ్మణులకు తగిన దక్షిణ నివ్వమని, ముత్తైదువులకు వాయనాలను ఇవ్వమని పుష్కరస్నానకల్పం చెప్తుంది.

దానధర్మాలు

గృహస్థులు ఈ పుష్కరకాలాన్ని చక్కగా వినియోగించుకోవాలి. శాస్త్రాలు పుష్కర సమయంలో దానవిధిని ఇలా ఉపదేశిస్తున్నాయి. మొదటిరోజు సువర్ణ – రజత – ధాన్య – భూదానాలు, రెండవరోజు వస్త్ర – లవణ – ధేను – రత్న దానాలు, మూడవరోజు – గుడ, అశ్వ, శాక, ఫలదానాలు, నాల్గవరోజు ఘృత – తైల – క్షీర – మధు దానాలు, ఐదవరోజు ధాన్య – శకట – మహిషీ – వృషభ – హల దానాలు, ఆరవరోజు ఔషధ – కస్తూరి – చందన దానాలు, ఏడవరోజు గృహ – పీఠ – శయ్య – ఆందోళికా దానాలు, ఎనిమిదవరోజు చందన – పుష్పమాల– మూలఅర్ద్రక దానాలు, తొమ్మిదవ రోజు పిండ – దాసీ – కన్యా – కంబళ దానాలు, పదవరోజు శాక – సాలగ్రామ – పుస్తకదానాలు, పదకొండవరోజు గజాది దానాలు, పన్నెండవరోజు తిల – అజాది దానాలు, మిక్కిలి ప్రశస్తమైనవి.



సువర్ణ, రజత దానంవల్ల ఈ లోకంలో సుఖభోగాలతోబాటు సూర్య, చంద్రలోక ప్రాప్తి, భూదానంవల్ల భూపతిత్వం, వస్త్రదానంవల్ల వసులోకప్రాప్తి, గోదానం వల్ల రుద్రలోకప్రాప్తి, ఆజ్యదానంవల్ల ఆయుష్యాభివృద్ధి, ఔషధదానంవల్ల ఆరోగ్యం, సాలగ్రామదానంవల్ల విష్ణులోకం, గృహదానంవల్ల చిరసౌఖ్యం, తిలదానం వల్ల ఆపదలు తొలగిపోవడం మొదలైన ఫలితాలు నిర్దేశింపబడ్డాయి.

తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి పుష్పయాగ మహోత్సవం

20-7-2015	సోమ	పుష్పయాగ మహోత్సవ అంకురార్పణ	ఆషాఢమాసమున ఉత్తర ఫల్గుని
21-7-2015	మంగళ	పుష్పయాగ మహోత్సవం	నక్షత్రమున జరుగును.

పూజాపునస్కారాలు



ఈ పర్వకాలాల్లో ఎన్నోరకాల పూజలు కూడా చెప్పబడ్డాయి. అందులో మూడున్నర కోట్ల తీర్థాలతో పుష్కర ప్రవర్తకుడైన బృహస్పతిని, త్రిమూర్తులను, ఇష్ట దేవతను పూజించాలి. ఇంకా గోదావరి ప్రవాహం ప్రాంతంలో ఉన్న ఇతర పుణ్యతీర్థాలను, వాటిలో వెలసిన దేవతలను తప్పక పూజించాలి. పుష్కర సంవత్సరంలో ప్రత్యేకంగా చెప్పబడిన ఆయా విశిష్ట సమయాల్లో దేవతలను పూజింపమని కూడా పుష్కరకల్పం చెప్తున్నది.

తీర్థశ్రాద్ధవిధి

పుష్కరసమయంలో తప్పనిసరిగా ఆచరించవలసిన పుణ్యకార్యం తీర్థశ్రాద్ధం. దీన్ని పుష్కరాలలో తొమ్మిదవ రోజు జరుపుకోవడం చాలా మంచిది. అలా కాకపోతే ఆయా పితృదేవతల (మృత) తిథినాడు కాని, పన్నెండు రోజులలో ఏదో ఒక రోజు కాని ఆచరించవచ్చు. తల్లి దండ్రులు లేనివారే ఈ తీర్థశ్రాద్ధాన్ని ఆచరించడానికి అర్హులు.

ఈ శ్రాద్ధకర్మ పితరుల ప్రేతత్వవిముక్తి, పుణ్యలోకప్రాప్తికి మాత్రమే కాకుండా వంశం పెరగడానికి, మంచి కలగడానికి సాధనం అవుతుంది. పుష్కర కాలంలో చేయబడే ఈ తీర్థశ్రాద్ధంలో మాతృవర్గ, పితృవర్గాలకే కాకుండా, మాతామహి మాతామహ వర్గానికి, భ్రాతృ– పితృవ్య, భగినీ – భావుక, శ్వశుర – స్యాలక – గురు మొదలైన వారికి మరణించిన తన సంబంధులందరికి పిండప్రదానం చేయాలి.

అంతేకాక తనకు ఉపకారం చేసినవారు మిత్రులు, ఆశ్రితులు, సేవకులు, విష, శస్త్ర, అగ్ని, జల, అశానిపాతాదువల్ల దుర్మరణాన్ని పొందినవారు, మరణానంతరం అంత్యకర్మ లోపించినవారు, క్షయ, అపస్మారక, కుష్టాదిరోగాలతో మరణించినవారు, దారాపుత్రాదులు లేనివారు, వికలాంగులు, కర్మభ్రష్టులు, జాతిభ్రష్టులు, బ్రహ్మహత్యాది మహాపాపాలు చేసినవారు ఎవరైనవుంటే వారందరికి సద్గతి కలగడానికి ధర్మపిండ ప్రదానం చేయబడుతుంది. ఇలా తీర్థ శ్రాద్ధాన్ని ఆచరించటం ద్వారా పితృదేవతల అనుగ్రహం కలిగి, వారి ఆశీస్సులు లభించి, తను, తనకుటుంబం సుఖశాంతులతో జీవించే అవకాశం లభిస్తుంది.

తన శక్తికి తగినట్లు సామాన్య మానవుడైనా పారణ విధానంగా అన్నశ్రాద్ధాన్ని ఆచరించడం మంచిది. అలా సాధ్యం కాకపోతే ఆమశ్రాద్ధాన్ని, లేకపోతే హిరణ్య శ్రాద్ధాన్ని చేయవచ్చు.



ఈ గోదావరి పుష్కరం భారతీయులమైన మన అందరకు గొప్ప భాగ్యవశమున వచ్చిన మహావకాశం. ఈ సమయంలో వారి వారి శక్తికి, అర్హతకు తగినట్లు పైన చెప్పిన స్నాన, దాన, శ్రాద్ధాది కర్మలను అనుష్ఠించి మంచి పుణ్యవిశేషాన్ని మన మందరం సంపాదించుకోవడానికి ప్రయత్నం చేద్దాం. 



జపయజ్ఞ ప్రశస్తి



కె. మల్లికార్జున, బళ్ళారి, 9480065333

"యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి" "యజ్ఞాలలో నేను జపయజ్ఞం" అన్నాడు – భగవద్గీతలో కృష్ణపరమాత్మ. ఈ జపంవల్ల చిత్తం పరిశుద్ధమౌతుంది. ఇది జన్మార్జితపాపాలను ప్రక్షాళనం చేసి, బ్రహ్మజ్ఞానవ్యాప్తికి దోహదపడుతుంది. ఏకాగ్రతను కల్గిస్తుంది. మోక్షప్రాప్తికి తోడ్పడుతుంది. అన్ని యజ్ఞాలకన్నా జపయజ్ఞం చాలా గొప్పదని శాస్త్రం చెబుతుంది. యోగం లేదా ధ్యానంలో జపం ఒక ముఖ్యాంశంగా చెప్పబడుతుంది.

జకారో జన్మవిచ్ఛేదః పకారః పాపనాశకః ।

జన్మపాపవినాశత్వాత్ జప ఇత్యభిధీయతే ॥

'జపం' అనే పదానికి నిర్వచనం – 'జ' అంటే జన్మ విచ్ఛేదనం చేసేది. 'ప' అంటే పాపాన్ని నశింపజేసేది. జపం చేసేటప్పుడు మనస్సులో దైవనామాన్ని పఠించాలి. భగవంతునిపై దృష్టి పెట్టుకోవాలి. మనస్సు అనేక సమస్యలతో సతమత మవుతుంది. అటువంటి సమస్యలను అధిగమించి, ఏకాగ్రతతో దైవ ధ్యానంతో జపం చేస్తే – అన్ని సమస్యలు తీరిపోతాయి. మనస్సు ప్రశాంతంగా ఉండి ఆనందమయ మవుతుంది. మన ఉనికినే మరచిపోయి దైవ సన్నిధిని చేరి ప్రశాంతతతో కూడిన అనుభూతిని పొందుతుంది.

పూజాకోటి సమం స్తోత్రం

స్తోత్రకోటి సమో జపః ।

జపకోటి సమం ధ్యానం

ధ్యాన కోటి సమో లయః ॥

కోటి పూజలు చేయడంవల్ల వచ్చేఫలం ఒక స్తోత్రంతో సమానం. కోటిజపాలవల్ల వచ్చే ఫలం ఒక ధ్యానంతో సమానం. కోటిధ్యానాలవల్ల వచ్చేఫలం ఒక తాదాత్మ్యస్థితికి సమానం. అందుకే 'జపకోటిసమం ధ్యానం' అని అన్నారు – విజ్ఞులు.


నిశ్చలమనస్సుతో, ఏకాగ్రతతో, దైవచింతనతో జపం చేస్తాం. అటువంటి జపాన్ని మూడు విధాలుగా గుర్తించారు – మన పెద్దలు.

1. వాచికం 2. ఉపాంశువు 3. మానసికం.

1. వాచికం:– దైవనామాలతో కూడిన మంత్రబీజాక్షరాలను తన చుట్టూ ఉన్నవారికి వినిపించేటట్లు గట్టిగా పలుకుతూ చేసే జపం.

2. ఉపాంశువు:– తనకు అత్యంత సమీపంలో ఉన్నవారికి వినిపించేటట్లు, పెదవులను కదుపుతూ మంత్ర బీజాక్షరాలను పలికే విధానం.

3. మానసికం:– తన మనస్సు లేదా చిత్తంలో ఎవరికి వినిపించకుండా భగవంతునినామ బీజాక్షరాలను జపించడం.



వాచిక జపంకంటే ఉపాంశువు జపం వంద రెట్లు ఫలితాన్ని ఇవ్వగా, ఉపాంశువు జపం కంటే మానసిక జపం వెయ్యి రెట్లు ఫలితాన్ని ప్రాప్తింపజేస్తుంది. నిశ్చలమైన ప్రదేశంలో మానసికజపం చేయటం మంచిదని విజ్ఞుల వచనం.







అందుకే మహర్షులు, యోగులు, మహాత్ములు, హిమాలయ ప్రాంతాలకు వెళ్లి, భగవంతుని నామాన్ని జపిస్తూ ముక్తిని పొందారు.

జపం చేయడానికి సాధకులు వివిధ రకాల జపమాలలను ఉపయోగిస్తారు. ఉదా: రుద్రాక్షమాల, స్ఫటికమాల, తులసీమాల.

జపమాలలో పూసల సంఖ్య: సాధారణంగా ఏ జపమాల అయినప్పటికీ ప్రతి జపమాలలో 108 పూసలు ఉంటాయి. కొన్ని మాలల్లో 54 లేదా 27 పూసలుంటాయి. ఈ పూసల సంఖ్య వెనుక ఒక పరమార్థముంది. మన శరీరంలో సుమారు 72000 నాడులున్నట్లు వైద్యనిపుణుల మాట. వాటిలో హృదయానికి సంబంధించిన నాడులు 108 ఉన్నట్లు గుర్తించారు. హృదయపూర్వకంగా, మనస్సాక్షిగా, చిత్తశుద్ధితో దైవనామాన్ని జపించాలి. అప్పుడే మోక్షం సిద్ధిస్తుందని మన పూర్వీకుల నమ్మకం. అందుకే జపమాలల్లో 108 పూసలసంఖ్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రతిమాలలో ఒకపెద్దపూస ఉంటుంది. దానిని 'మేరుపూస' అంటారు. ఈ మేరుపూస లెక్కకు రాదు.

జపమాల వినియోగం, ఫలితాలు:– సాధకులు జపమాలలను మూడువిధాలుగా ఉపయోగిస్తారు.

1. కరమాల :– కుడిచేతి అనామిక (ఉంగరంవేలు) మధ్య కణుపునుండి ప్రారంభించి, చిటికెనవ్రేలు నుండి చూపుడువ్రేలు వరకు గల పది కణుపులతో ప్రదక్షిణంగా జపిస్తే – కరమాలతో జపించినట్లవుతుంది.

2. అక్షమాల :– 'అ' నుండి 'క్ష' వరకు గల 54 అక్షరాలతో జపించడమే అక్షమాల. 'అ' అనంతఫలాన్ని ఇస్తుంది. 'క్ష' కల్మషాలను తొలగిస్తుంది.

3. మణిమాల :– రుద్రాక్షమాల, స్ఫటికమాల, తులసీమాల, పగడాలమాల మొదలైన మాలలతో జపం చేస్తారు – సాధకులు. ఒక్కొక్క మాలను ఉపయోగించి, జపము చేస్తే దాని ఫలితం విశేషంగా ఉంటుంది. శంఖమాలతో జపం చేస్తే శతఫలితం, పగడాలమాలతో సహస్రఫలితం, స్ఫటికమాలతో దశసహస్రఫలితం, ముత్యపుమాలతో లక్షఫలితం, తామర పూసలమాలతో దశ లక్ష ఫలితం, బంగారు పూసలమాలతో కోటి ఫలితం, తులసీమాలతో అనంతకోటి ఫలితం, రుద్రాక్ష మాలతో అనంతఫలితం సంప్రాప్తిస్తుంది.

పగడాలమాలతో జపంచేస్తే ఐశ్వర్యవృద్ధి, ముత్యపు మాలతో మంగళం, తులసీమాలతో సమస్తఫలాలు, రుద్రాక్షమాలతో ఆత్మజ్ఞానం కలుగుతాయి.

జపం–ఆసనం :–సాధకుడు జపంచేయడానికి ముందు ఆసనం ఎన్నుకొంటాడు. వెదురు కర్రలమీద జపం చేస్తే దారిద్ర్యం, రాతిమీద రోగం, నేలమీద దుఃఖం, గడ్డిపరకమీద యశస్సు తగ్గడం జరుగుతుంది. కానీ కృష్ణాజినంమీద జపం చేస్తే జ్ఞానం కలుగుతుంది.

కృష్ణాజినం ప్రత్యేకత :– కృష్ణాజినం వేదస్వరూపం, దేవతలు యజ్ఞము చేస్తుండగా, ఋక్, సామవేదాలు లేడి రూపంలో యజ్ఞం ప్రక్కకు వచ్చి, తప్పుకొన్నాయి. మరల దేవతలు ప్రార్థించగా మరల అవి వచ్చాయని వేద వచనం. ఋగ్వేదవర్ణం తెలుపని, సామవేద వర్ణం నలుపని, అవే రాత్రి పగలు ప్రతీకగా లేడియందు ఉన్నాయి. ఆ రెండు రంగులను విడిచి పెట్టి, ఆ వేదాలు తిరిగివచ్చాయి.

అన్ని ఆసనాలకన్నా దర్భాసనం ఉత్తమం. ఈ ఆసనంమీద కృష్ణాజినం వేసుకొని, దానిపై తెల్లబట్టపరచి జపం చేయుట ఉత్తమం. ఏ సమయంలోనైనా అంటే ఉదయంగానీ, సాయంకాలంగానీ జపం చేసుకోవచ్చు. సాధకుడు జపం చేయడానికి ముందు, జపమాలను మంచి నీటితో శుభ్రం చేయాలి. అనంతరం పంచగవ్యాలతో శుభ్రపరచాలి.

ఆసనంపై తూర్పుముఖంగా గానీ, ఉత్తరముఖంగాగానీ కూర్చొని, జపమాలను కుడిచేతిలో ఉంచుకొని జపం చేయాలి. జపం చేసేటప్పుడు భగవంతుని నామాన్ని, ఏకాగ్రతతో పఠిస్తూ ఉండాలి. జపమాలను వేగంగా త్రిప్పకూడదు. జపం ఏకాంత ప్రదేశంలో చేయాలి. అప్పుడే సాధకుడు భగవంతుని సన్నిధికి చేరుతాడు. అంటే మోక్షం సిద్ధిస్తుంది.



పూరీ జగన్నాథస్వామి


మందరపు సోమశేఖరాచార్యులు, విజయనగరం, 7386814078

అవి పూరీని ఇంద్రద్యుమ్నుడు పరిపాలిస్తున్న రోజులు. ఆయన పాలనలో ప్రజలు ఏ చీకూ చింతా లేకుండా జీవనం సాగించేవారు. ఇంద్రద్యుమ్నుడు శ్రీమహావిష్ణువు భక్తుడు. ప్రతీరోజూ విష్ణువును పూజించేవాడు.

ఒకనాటి రాత్రి ఇంద్రద్యుమ్నునికి కలలో విష్ణువు కనిపించి "రాజా! నీకు సముద్రంలో కొయ్యదుంగలు కనిపిస్తాయి. వాటిని శిల్పాలుగా చెక్కించుము" అని చెప్పి అదృశ్యమయ్యాడు. ఇంద్రద్యుమ్నుడు చప్పున లేచి తనకొచ్చిన కలను పట్టపురాణి గుడుంబాదేవికి చెప్పాడు. మరునాడు రాజు సతీసమేతంగా సముద్రతీరానికి వెళ్ళాడు. కలలో చెప్పినట్లే సముద్రంలో కొయ్యదుంగ కొట్టుకు వస్తూ కనిపించింది.

విశ్వకర్మ మహారాజుతో "కొయ్యదుంగను మేమిరువురము మలుస్తాము. కానీ విగ్రహాలుగా మలచే ఆ సమయంలో మాకు అంతరాయం కలిగించకూడదు" అని ఇరువురూ మందిరంలోనికి వెళ్ళారు. పదిరోజులు గడచిపోయాయి. మందిరంలోనికి వెళ్ళిన ఇద్దరూ వెలుపలికి రాకపోవడంతో మహారాజుకేమీ పాలుపోలేదు. విగ్రహాలు పూర్తయ్యాయో లేదో తెలుసుకునేందుకు మహారాజు ఆతృతతో ఆ మందిరంలోనికి వెళ్ళాడు. ఆ మరుక్షణం వారిరువురు అదృశ్యమైపోయారు.

సగం మాత్రమే చెక్కబడి ఉన్న విగ్రహాలను చూసి మహారాజు తన తొందరపాటుకి ఎంతగానో చింతించాడు.



జూలై 18 పూరీ జగన్నాథస్వామి రథయాత్ర

వెంటనే భటులకు ఆ కొయ్యదుంగను బయటకు తీసుకురమ్మని చెప్పాడు. భటులు కొయ్యదుంగను బయటకు తెచ్చారు. ఆ సమయంలోనే విష్ణువు, విశ్వకర్మలు వృద్ధశిల్పకారుల రూపాల్లో అక్కడికి వచ్చారు. కొయ్యదుంగను విగ్రహాలుగా మలుస్తామని వారు చెప్పగానే మహారాజు ఎంతగానో సంతోషించాడు. అంతఃపురంలో మందిరంలో కొయ్యదుంగను భద్రపరిచారు.

మొండిచేతులతో ఉన్న కృష్ణ, బలరామ, సుభద్ర విగ్రహాలను అలాగే ప్రతిష్ఠించారు. అందువల్లనే ఆ విగ్రహాలు మొండిచేతులతోనే భక్తులకు దర్శనమిస్తుంటాయి.

ఆ రాజవంశీయులే ఇప్పటికీ జగన్నాథరథం ముందు చీపురుతో ఊడుస్తారు. లేనిపక్షంలో రథం ముందుకు కదలదు. కోరిన కోరికలు తీర్చేదైవంగా జగన్నాథుడు భక్తుల పూజలందుకుంటున్నాడు.



శ్రీ బాలాజి వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన మరియు పునరావాస సంస్థ (బర్డ్)

BIRRD





పోలియో మెల్లిటస్, సెరిబ్రల్ పాల్సీ, జన్మతః వచ్చే రుగ్మతలు, వెన్నెముక సంబంధమైన గాయాలతో బాధపడే వారికి మరియు ఎముకలు, కీళ్ళ పరమైన అంగవైకల్యం కలిగిన రోగులకు పూర్తి స్థాయిలో ఉచితంగా సేవ చేయడానికి అత్యాధునిక వైద్య పరికరాలతో 'బర్డ్' సంస్థ స్థాపించబడింది. ఈ వైద్య సంస్థకు మానవతా దృక్పథంతో మీ వంతు సహాయ సహకారాలను విరాళాల రూపంలో అందించండి. 'మానవసేవే మాధవసేవ'. అధికరణం 80 (జి) క్రింద ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వబడుతుంది.





డి.డి.లను కార్యనిర్వహణాధికారి, తి.తి.దే. తిరుపతి

పంపవలసిన చిరునామా :

ది డైరెక్టరు, బర్డు ట్రస్టు, తితిదే, తిరుపతి-517501, ఫోన్ నెం.0877-2264025

మరింత సమాచార లభ్యతకై సంప్రదించవలసిన ఫోను నెంబరు 0877-2264619












తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారికి
ఇటీవల జరిగిన వసంతోత్సవ దృశ్యాలు

ఓం నమో నారాయణాయ



TIRUMALA TIRUPATI DEVASTHANAMS
SAPTHAGIRI
ILLUSTRATED MONTHLY

మానవశరీరంలోని డెబ్బైరెండువేలనాడులలో 72 వేల తీర్థాలు, తీర్థాల అభిమానదేవతలు, అధిష్ఠాన దేవతలూ ఉన్నారు. ఈ 72 వేల నాడులలో ముఖ్యమైన నాడులు 108, అందులో ముఖ్యమైనవి 12 (ద్వాదశ). ఈ ద్వాదశ నాడులు ద్వాదశ నదులకు ప్రతీకలు.

ఈ 12 నాడులలో వారుణీనాడి ఒకటి. ఈ వారుణీనాడి గోదావరీ నదికి ప్రతిరూపంగా యోగులు గుర్తించారు. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన అను పంచప్రాణాలు ఈ వారుణీనాడికి స్థానం. వారుణీ నాడికి అధిష్ఠాన దేవత - శంఖ, చక్ర, పద్మ, గదాధరుడైన నారాయణుడు. గోదావరీనదికి అధిష్ఠాన దేవతకూడా నారాయణుడే!



గోదావరీ పుష్కరాలు
14-07-2015 నుండి
25-07-2015 వరకు




ఇటీవల శ్రీనివాసమంగాపురం
శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామివారికి జరిగిన వసంతోత్సవ దృశ్యం



మే 1 నుండి 6 వరకు ధర్మగిరి వేదవిజ్ఞానపీఠం, తిరుమలలో
జరిగిన కారేరీష్టి వరుణజప - పర్జన్య శాంతియాగం



శ్రీ సండ్ర వెంకటవీరయ్య,
శాసనసభ్యులు, ఖమ్మం జిల్లా.
వీరు తి.తి.దే. ధర్మకర్తలమండలి సభ్యులుగా
13.5.2015 న
తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారిసన్నిధిలో
ప్రమాణస్వీకారం చేశారు



శ్రీమతి వై.వి. అనురాధ, ఐ.ఏ.ఎస్.,
కమీషనర్, దేవాదాయశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.
వీరు తి.తి.దే. ధర్మకర్తలమండలి
ఎక్స్ అఫిషియో సభ్యులుగా 14.5.2015 న
తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారిసన్నిధిలో
ప్రమాణస్వీకారం చేశారు




తిరుమలలో యాత్రికుల సౌకర్యాలను విచారిస్తూ,
ఆన్‌లైన్ సేవారశీదులను పరిశీలిస్తున్న
తి.తి.దే. ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ చదలవాడ కృష్ణమూర్తి

పుష్కర దర్శిని

శ్రీమతి మారిశెట్టి సత్యవతి, నరసాపురం, 07893093358

రాజమండ్రిలో ఎన్నో దేవాలయాలు, మఠాలు, ధర్మశాలలు, సేవాసంస్థలు ఉన్నాయి. ఈ పట్టణమే ఒకప్పుడు పంచగిరి దుర్గంగా పిలువబడేది. ఈ ఐదుగిరులలో పుష్పగిరి లేక పుష్కరగిరి ఒకటి. పవిత్ర గోదావరినది ఈ పట్టణంగుండా ప్రవేశించి, 1. గౌతమి 2. వసిష్ఠ 3. వామదేవ 4. విశ్వామిత్ర 5. భరద్వాజ 6. ఆత్రేయ 7. జమదగ్ని అనే పాయలుగా సప్తఋషుల పేర్లతో ప్రయాణం సాగించింది.

ఈ నది దక్షిణ భారతదేశంలోని అన్ని నదులకన్నా గొప్పది. పెద్దది కూడా. ఇది సుమారు 900 మైళ్ళు పొడవు. పడమర కనుమలలో నాసికా త్రయంబకం దగ్గరగల బ్రహ్మగిరి కొండల్లో పుట్టి, అనేక భాషాప్రాంతాలు కలుపుకొంటూ, రాజమండ్రి దగ్గర విశాలమైదానంలో ప్రవేశించి, అఖండ గౌతమి అయ్యింది. ధవళేశ్వరంవద్ద రెండుగా చీలిపోయి, బంగాళాఖాతంలో కలుస్తోంది. ఈ నదినే ఖండగౌతమీ అని కూడా పిలుస్తారు. ఇచ్చట నదీస్నానం మిక్కిలి పవిత్రం. అఖండపుణ్యాన్ని ప్రసాదిస్తుంది.

గౌతమముని నిస్స్వార్థంతో తీసుకొచ్చిన ఈ నది గంగకన్నా పవిత్రమైనది. ఒకప్పుడు దేశంలో కరవువల్ల తిండిలేక బాధపడుచున్న తోటి ఋషులకు వారి శిష్యులకు గౌతమముని తన మహాతపశ్శక్తితో ఆహారపానీయాలు సమకూర్చి, అందరిని ఆదరించడం జరిగింది. తమకు లేని శక్తులు గౌతమునికి ఉన్నాయని ఆ ఋషులు ఈర్ష్యాద్వేషాలతో ఒక మాయాగోవుని పంపి, గౌతమమహాముని పంటలు పాడుచేయించారు. అది చూచిన గౌతముడు ఆ మాయాగోవుని దర్భపుల్లతో అదిలించగా, ఆ గోవు మరణించింది. గోహత్యచేసిన నీవు, మాకు పెట్టిన ఆహారం మేము తినము. ఆ పాపనివృత్తికోసం గంగను తేవాలని చెప్పారు. గౌతముడు మునిజనుల క్షేమంకోసం నిస్స్వార్థంతో శివుని గురించి తపస్సు చేసి, ఆతనిని మెప్పించి, గంగను భూమిమీదకు పంపమని కోరాడు. శివుడు అనుగ్రహించి తన జటాజూటంనుంచి గంగను వదిలాడు. ఆ గంగయే గౌతమమునిచే తీసుకురాబడింది కనుక గౌతమ గోదావరిగా మారింది. గౌతముడు గోదావరిని మరణించిన గోవుమీదుగా ప్రవహింపచేసి గోహత్యాపాపం నివృత్తి చేసుకున్నాడు. గోవుకి స్వర్గప్రాప్తి కలిగింది. ఆ స్థలమే ఇప్పుడు కొవ్వూరుగా పిలువబడుచున్న గోపాదక్షేత్రం. గోదావరికి తూర్పువైపున రాజమండ్రి, పశ్చిమంవైపున కొవ్వూరు ఉన్నాయి.

బృహస్పతి సింహరాశియందు ప్రవేశించిన సంవత్సరకాలము 3 కోట్ల 50 లక్షల పుణ్యతీర్థములు గోదావరినదిలో ఉంటాయి. గోదావరినది స్వర్గలోకమునకు వెళ్ళి పుష్కరరాజ తీర్థమును కలసి, "బృహస్పతి సింహరాశిలో ప్రవేశించినప్పుడు సమస్త 3 కోట్ల 50 లక్షల పుణ్యతీర్థాలు తనలో సంవత్సరకాలము ఉంటాయని, నీవు కూడా రావాలని" పుష్కరుని ప్రార్థించింది. స్వర్గలోకం వదిలి వెళ్ళలేని పుష్కరుడు 'నీ కోరిక మన్నించి బృహస్పతి సింహరాశిలో ప్రవేశించిన సంవత్సరం మొదట 12 రోజులు చివర 12 రోజులు ఉంటానని' వరమిచ్చాడట.

గోదావరినదికి మాత్రమే ఆదిపుష్కరాలు, అంతిమపుష్కరాలు జరుగుతాయి. మిగిలిన నదులకు అంత్యపుష్కరాలు ఉండవు. గోదావరినది త్రయంబకమునందు గోవు నోటినుండి వెలువడి అంతర్వాహినియై నాసిక్‌నందు బహిర్గతమవుతుంది. నాసిక్‌నందు పుష్కరదినాలలో కుంభమేళా జరుగుతుంది. గోదావరినదికి ఉపనది



భారతదేశాన్ని పునీతంచేస్తున్న సప్తపుణ్యతీర్థాలలో గోదావరి ఒకటి.

శబరి. శబరి రామనామం జపిస్తూ, రామునికోసం తపిస్తూ, రామదర్శనం కాగానే తరించి పవిత్రమైన నదిగా మారి భూలోకంలో మానవులకు ఉపయోగకారిగా పవిత్రమైన నది అయ్యింది.

పవిత్ర గోదావరినదిలో స్నానం చేసి దగ్గరలో ఉన్న ఎన్నో దేవాలయాలు స్వయంభూమూర్తులను దర్శించుకోవచ్చు. అంతేకాదు తూర్పుగోదావరిజిల్లాలో ఎన్నెన్నో స్వయంభూమూర్తులు ఉన్నారు. అందులో రాజమండ్రి నుంచి కాకినాడకు వెళ్ళేమార్గంలో ద్వారపూడి ద్వాదశ జ్యోతిర్లింగాలు, అయ్యప్పస్వామి, అర్ధనారీశ్వరుడు, ఆంధ్రశబరిమలై, సాయిబాబా, ఆంజనేయస్వామి ఆలయాలు ఉన్నాయి. అనపర్తిలో అనేక ఆలయాలు, బలభద్రపురం, బిక్కవోలులో స్వయంభూ విఘ్నేశ్వరుడు, బాలసుబ్రహ్మణ్యుని గుడిలో శైవకుటుంబం అంతా అందులోనే ఉంటుంది. చాళుక్యుల శిల్పకళావైభవమంతా చెక్కుచెదరకుండా ఉంది. పెద్ద బ్రహ్మదేవం రాజరాజేశ్వరుడు ఇది స్వయంభూమూర్తి. సామర్లకోటలో బస్సుదిగగానే గోదావరి గట్టుకిరాగానే నారాయణుడి గుడి, కొంచెం ముందుకు వెళితే పంచారామములలో ఒకటైన కుమారస్వామి ప్రతిష్ఠించిన కుమారభీమరాయ క్షేత్రం ఉంది. ఇది చాళుక్యుల శిల్పకళతో ఉంది. సామర్లకోటకు ఉత్తరంగా కిలోమీటర్‌దూరంలో పురాతనమైన చంద్రశేఖరఆలయం, ఆ ప్రాంతంలో జగదీశ్వరస్వామిఆలయం, కనకమహాలక్ష్మి, జగదాంబ, వేణుగోపాల, వేంకటేశ్వరస్వామివార్ల ఆలయాలున్నాయి. సామర్లకోటకు 10 కిలోమీటర్లదూరంలో పిఠాపురం ఉంది. అచ్చటకు వ్యాసుడు శిష్యసమేతుడై కుక్కుటేశ్వరస్వామిని, శ్రీకుంతీమాధవ స్వామిని, పీఠికాంబికను సేవించాడు. 18 శక్తి పీఠాలలో పురూహూతికాదేవి ఇచ్చట ఒకటిగా ఉంది. ఇచ్చట లింగానికి కుక్కుటాకారంగా రేఖలు ఉంటాయి. ఇచ్చట పుష్కరిణి పాదగయ, త్రిగయ క్షేత్రములలో ఒకటి. ఇదే ప్రాకారంలో శ్రీదత్తస్వామిఆలయం ఉంది. ఇది స్వయంభూమూర్తి. పిఠాపురము వెళ్ళేదారిలో అన్నవరం పంపానదీతీరంలో ఉంది. తెలుగుదేశంలో ప్రఖ్యాతి కలిగిన క్షేత్రం శ్రీవీరవేంకట సత్యనారాయణస్వామి, అమ్మవారు అనంతలక్ష్మి, సత్యవతి, క్షేత్రపాలకుడు, శ్రీరామచంద్రుడు మొదలైనవన్నీ ఉన్నాయి. ఆలయం ఎదుట ఉన్న మండపానికి ఎడమవైపు (నీడ గడియారం (లేక) సూర్యఘంట) తప్పక చూడదగ్గది.



పెద్దాపురం సామర్లకోటకు 4 కిలోమీటర్లదూరంలో ఉంది. ఇచ్చట పాండవులమిట్టపై సూర్యనారాయణస్వామి ఆలయం ఉంది. ఇచ్చట కన్యకాపరమేశ్వరి, శ్రీరామాలయము, ఆంజనేయస్వామి, విశ్వేశ్వరస్వామి ఆలయాలున్నాయి. ఇచ్చట సూర్యనారాయణమూర్తి గుడి ఉంది. ఈ గుడిపై ఉన్న శిల్పకళలు భారత, భాగవత, రామాయణాలను కథలుగా తెలుపుతాయి. ఇచ్చటనే కోదండరామాలయమున్నది. దీనినే రెండవ భద్రాచలమని అంటారు. ఇచ్చట ఉండే మూర్తులను కూడా చూచి తీరాల్సిందే.

రాజమండ్రిలో నున్న ముఖ్యమైన స్నానఘట్టాలు, మఠాలు, ధర్మశాలలు/సేవాసంస్థలు, దేవాలయాలు :

స్నానఘట్టాలు :

కోటిలింగాలరేవు, పుష్కరాలరేవు, మార్కండేయరేవు, శంకరమఠంరేవు, కంభంసత్రం-దారిరేవు, విశ్వేశ్వరాలయంరేవు, ఆల్‌కట్‌గార్డెన్‌రేవు, దక్షిణామూర్తిరేవు, ధవళేశ్వరం రామపాదాలరేవు మొదలైనవి.

మఠాలు :

శ్రీరామకృష్ణమఠం, ఉత్తరాదిమఠం, గౌడీయమఠం, శంకరమఠం, కొప్పర్తివారి తులసిరామానుజకూటం, కాకివారిభవనం, గీతాభవనం, హిందూసమాజం, సాదుస్త్రీలమఠం విశ్వహిందూపరిషత్ మొదలైనవి.

ధర్మశాలలు / సేవాసంస్థలు :

వాడ్రేవువారి సత్రం, కంభంవారి సత్రం, దర్భావారి సత్రం, నాళంవారి సత్రం, మల్లిగంవారి సత్రం, చందావారి సత్రం, పువ్వాడవారి సత్రం, మార్వాడివారి సత్రం, విశ్వబ్రాహ్మణ సత్రం, కోటిలింగాల ధర్మసత్రం, హితకారిణి సమాజం, శ్రీరామకృష్ణమిషన్, గౌతమీజీవకారుణ్య సంఘం, మహాత్మాగాంధీ సేవాసమితి మొదలైనవి.

దేవాలయాలు :

శ్రీకోటిలింగేశ్వరస్వామివారిఆలయం:

పరమశివునికి మహాభక్తుడైన రావణబ్రహ్మ ఇచ్చట కోటిలింగాలు ప్రతిష్ఠచేశాడట. ఒక లింగంను వాయసము తీసుకువెళ్ళి కాశీలో పడవేసింది. బ్రహ్మపురాణమును బట్టి త్రిపురాసుర సంహారము ఇక్కడనే జరిగి, కోట్లాదిరాక్షసులు శంకరునిచే చంపబడి లింగాకారంలో సారూప్యముక్తిని పొందడం జరిగింది. కోట్లాదిలింగాలు ఈశ్వరునిలో నిండియుండటం చేత దీనికి కోటిలింగాలక్షేత్రం అనిపేరు వచ్చింది. దీనినే దక్షిణకాశీ అని కూడా అంటారు. ఈ ఆలయంలో విష్ణుకోవెల కూడా ఉంది. ఇక్కడనే కోటిలింగ స్నానఘట్టంలో విశాల పుణ్యతీర్థం ఉంది.

శ్రీమార్కండేయస్వామివారి ఆలయం:



ఇది మార్కండేయుడు శివుని అనుగ్రహంతో మృత్యువుని జయించి చిరంజీవిగా జీవించు అని వరాన్ని ప్రసాదించిన దివ్యక్షేత్రము. ఈ ప్రదేశంలో శ్రీవేంకటేశ్వరస్వామి మందిరం, సుబ్రహ్మణ్యేశ్వర, సూర్యదేవుని మందిరాలు కూడా ఉన్నాయి. ఇచ్చట ఎదురుగా పద్మతీర్థం అనే స్నానఘట్టం ఉంది.

శ్రీకాశీవిశ్వేశ్వర, శ్రీ బిందుమాధవస్వామివార్లఆలయం:

ఇది ఇన్నీస్‌పేట రైలు వంతెనను ఆనుకొని ఉంది. ఇందు శ్రీసుబ్రహ్మణ్యేశ్వర, రమాసహిత శ్రీసత్యనారాయణస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయాలు ఉన్నాయి. ఇచ్చట ఎదురుగా ఆనందతీర్థము అనే స్నానఘట్టం ఉన్నది.

శ్రీఉమారామలింగేశ్వరస్వామివారిఆలయం :

ఇది జాంపేట గాంధీబొమ్మవద్ద ఉంది. శ్రీ రామలింగేశ్వర స్వామి అమ్మ పర్వతవర్ధనిదేవి ఇంకా వళ్ళీదేవసేనసమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి, గణపతి, ఈ ప్రాంగణంలోనే శ్రీచాముండేశ్వరుడు, నవగ్రహాలు, శ్రీ కాలభైరవస్వామి విగ్రహాలు ఉన్నాయి.

శ్రీవేణుగోపాలస్వామివారిఆలయం :

ఈ క్షేత్రము శ్రీరంగం, తిరుపతి, పూరీజగన్నాథము, మధుర, ప్రయాగ మున్నగు నూటఎనిమిది పుణ్యక్షేత్రాలలో ఇది మొదటిదని బ్రహ్మపురాణంలో చెప్పబడింది. వ్యాసుడు, శుకుడు వారి ఆశ్రమం సమీపంలో రామతీర్థం అనే స్నానఘట్టం ఉన్నది. రాజమండ్రికి క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి. ఈ మూర్తి పరాశరమహర్షి ప్రతిష్ఠ అని ప్రతీతి.

శ్రీలక్ష్మీనరసింహస్వామివారిఆలయం :

కంభంవారి సత్రం సమీపంలో శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం మధ్యనున్నదీ అపురూప దేవాలయం. రాజమండ్రిలో చాళుక్యశిల్పసంపదతో అలరారుతూ ఆనందాన్ని కలిగిస్తూ ఉంటుంది. పూర్వం రాజరాజనరేంద్రుని కోటలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి విగ్రహంతో ఈ దేవాలయాన్ని పునర్నిర్మించారనీ అదియే ఇది అనీ ప్రతీతి.

శ్రీసత్యనారాయణస్వామివారిఆలయం :

ఇది ఆర్యాపురంలో ఉంది. ఇచ్చట అన్నవరంలో శ్రీ సత్యనారాయణస్వామి కొండమీద జరుగునట్లుగా వివాహాది శుభకార్యాలు జరుగుతాయి.

శ్రీసూర్యచంద్రదేవాలయం :

ఇది శ్రీకోటిలింగేశ్వరస్వామివారి ఆలయానికి రెండు ఫర్లాంగుల దూరంలో దక్షిణంవైపు ఉన్నది. ఇచ్చట శేషతీర్థమనే స్నానఘట్టం ఉన్నది.





ధారావాహిక
47

మందార మకరందాలు



ఘనుఁ డా భూసురుఁ డేగెనో; నడుమ మార్గశ్రాంతుఁడై చిక్కెనో;
విని కృష్ణుం డిది తప్పుగాఁ దలఁచెనో; విచ్చే సెనో; యీశ్వరుం
డనుకూలింపఁ దలంచునో తలఁపఁడో? యార్యామహాదేవియున్
నను రక్షింప నెఱుంగునో యెఱుఁగదో? నా భాగ్య మె ట్లున్నదో:

రేపు లగ్నం, భూసురు డింకా తిరిగి రాలేదు. గోవిందుడేమన్నాడో తెలియదు. ధీరగా, గంభీరంగా కల్యాణ సందేశాన్ని పంపిన రుక్మిణి తడబడిపోతున్నది, తల్లడిల్లిపోతున్నది. చెప్పరాని ఆందోళన. ఎవరితోనూ చెప్పుకోలేని సందేహ పరంపర. లక్ష్మి అంశలో పుట్టిన రుక్మిణికేనా ఈ సంశయాలు? ''స్వామీ! పూర్వం నిన్ను రమాకాంతాలలామం కోరింది. ఈ జన్మలో నేను కోరుతున్నాను. ఇందులో నా తప్పేముంది?'' అని తన సందేశంలో అంత నిక్కచ్చిగా చెప్పిన రుక్మిణి ఇంత ముగ్ధగా. సందిగ్ధగా ఎలా మారిపోయింది.

ఈ పద్యంలో రుక్మిణి లక్ష్మీస్వరూపిణి కాదు. కేవల బాలామణి. కన్యాసహజమైన మోహం ఆవరించినప్పుడు అన్నీ సందేహాలే: చివరికి వెళ్ళవలసిన బ్రాహ్మణుడు వెళ్ళెనో లేదో అన్నంతదాకా సాగిపోయింది ఆ సందిగ్ధచిత్తం. వలచినహృదయం లోని ఆటుపోటులను సహజసుందరంగా చిత్రించిన పద్యమిది. ఇప్పటికీ మనలో సందేహాలు ముసురుకున్నప్పుడు ఈ పద్యం గుర్తుకొస్తుంది. అన్నీ ప్రశ్నలే ఉండడం ఈ పద్యంలోని మరొక విశేషం. అయితే మాంగల్యప్రదాయిని అయిన ఆ సర్వమంగళాదేవి సంస్మరణమే విపత్సాగరతరణం కాదా!

- జ్ఞానపీఠ అవార్డుగ్రహీత, పద్మభూషణ్ డా॥ సి.నారాయణ రెడ్డి

శ్రీపెద్దఆంజనేయస్వామివారిఆలయం :

దీనిని హిందూస్థాన్ సాధువులమఠం అని కూడ పిలుస్తారు. ప్రతి మంగళవారం ఇచ్చట భక్తులు క్రిక్కిరిసి ఉంటారు. చాల మహిమగల క్షేత్రమని ప్రతీతి.

శ్రీధవళగిరి జనార్దనస్వామి వారి ఆలయం:

ఇది ధవళేశ్వరంలో ఉన్నది. ఇక్కడ గోదావరితీరమున రామపాదాలను అగస్త్య మహర్షిచే ప్రతిష్ఠించబడినట్లు ధవళగిరి మాహాత్మ్యము, శ్రీలక్ష్మీజనార్దనస్వామి చరిత్ర చెప్తున్నాయి. అందుకే దీనికి రామపాదతీర్థమనే స్నానఘట్టం అనే పేరు సార్థకమైంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉభయగోదావరిజిల్లాలకు కరవుకాటకాలను అరికట్టిన ధవళేశ్వరం ఆనకట్ట ఇది. లక్షల ఎకరాలు సాగులోకి వచ్చి ఆంధ్రప్రదేశ్‌కే అన్నపూర్ణ అయింది. దీనిని సర్ ఆర్థర్ కాటన్ నిర్మించారు. రాజమండ్రికి వచ్చిన దేశవిదేశీయులు సైతం ఈ ఆనకట్టను చూసేవెళ్తారు. సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజి ధవళేశ్వరం ఆనకట్టకు దగ్గరలో ఉంది.

2015 ఆగష్టు నెల రాశిఫలాలు



మేషరాశి

ఆర్థిక స్వాలంబన ముఖ్యం. లెక్కపత్రం లేకుండా చేసే ఖర్చులు, విపరీత ప్రభావాన్ని చూపుతాయి. కొన్ని సందర్భాలలో ఎంత ఖర్చు చేసినా ఫలితం శూన్యం. ఇరుగు, పొరుగువారితో మాట సంయమనం పాటించండి. కలహ సూచనలు.



వృషభరాశి

మాసారంభంలో వనులలో ఉత్సాహం. శ్రవణానందకరమైన సమాచారం లభించుట. ధనధాన్య వృద్ధి. స్త్రీమూలక ధనలాభం. మనోవాంఛిత వస్తు లాభాలు కలుగుతాయి. మాతృసౌఖ్యం. వ్యాపార లాభాలు. వ్యవహారాలలో జయం.



మిథునరాశి

మనసున తలచిన కార్యాలు ముందుకు సాగుతూ, విఘ్నాలు కలుగుతూ మరలా ముందుకు సాగుతూంటాయి. విద్యార్థులు కృషి, శ్రద్ధ కలిగి ఉంటారు. మాసాంతమున కార్య ఉత్సాహం అవసరానికి ధనప్రాప్తి. ఉద్యోగులకు గతకాల బకాయిల చెల్లింపు, బహుమతి వితరణ చేస్తారు.



కర్కాటకరాశి

ఆర్థిక, వ్యాపారరంగ ప్రముఖులతో సదస్సులు, సమావేశాలు జరుపుతారు. నూతన పరిచయాలు సంతోషం కలిగిస్తాయి. మాసాంతంలో శారీరక అలసత్వము, ఉష్ణసంబంధ అనారోగ్యాలు సూచితాలు, దుస్వప్నాలు కలవరపెడతాయి.



సింహరాశి

పరప్రాంతంలో నివసించాల్సి వస్తుంది. కంటికి సంబంధించిన అనారోగ్యాలు నత్త నడకన సాగుతాయి. గతంలోని అపరిష్కృత సమస్యలు ఒక కొలిక్కి వస్తాయి.



కన్యారాశి

మనో విచారం, భోజన అసౌఖ్యం, కొన్ని సందర్భాలలో లేకితనం ఉంటాయి. శరీరం, అసౌఖ్యానికి గురి అయి వృత్తి వ్యాపారాలకు అడ్డంకిగా మారుతుంది. మాసాంతంలో ఆలోచనలకు తగిన నిర్ణయాలు తీసుకోలేకపోవుట.



తులారాశి

ఉద్యోగులకు అప్రయత్న పదోన్నతి, తద్వారా స్థానచలనం, జాయింటు వ్యాపారులకు ఇష్టసిద్ధి. శ్రమైక జీవనం ఉన్నా, సత్ఫలితం పొందుతారు. కొన్ని స్పర్థలు ఉన్నప్పటికీ సర్దుకుని ముందుకు సాగుతారు.



వృశ్చికరాశి

సజ్జన సాంగత్యం. పవిత్ర గ్రంథ పఠనం. విశేష భక్తి భావాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో దిగ్గజాల వంటి వారి పరిచయాలు లభిస్తాయి.



ధనూరాశి

దూరప్రాంత ప్రయాణాలు, తీరిక లేని ప్రణాళికలు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. బహుకాలం నుంచీ అపరిష్కృతములైన సమస్యలు పరిష్కార దిశగా అడుగులు వేస్తాయి. ఆరోగ్యాన్ని కంటికి రెప్పలా చూసుకోవాలి.



మకరరాశి

ప్రభుత్వంతో సంబంధం ఉన్న కోర్టు వ్యవహారాలలో చుక్కెదురు. అందివచ్చిన అవకాశం దురదృష్టవశాత్తు చేజారుతుంది. నేత్ర సంబంధాలైన అనారోగ్యం సూచితం. విద్యార్థులకు మాసాంతంలో ప్రశంసా పారితోషికాలు.



కుంభరాశి

భూసంపాదనకై చేసే ప్రయత్నాలు సత్ఫలితాల నిస్తాయి. కొన్ని సమస్యలు ఎదురైనా, ధైర్యంతో ముందుకు సాగుతారు. సంఘంలో కీర్తి ప్రతిష్ఠలు కలుగుతాయి. విద్యావంతులైన స్నేహితుల సాయంతో కొన్ని విషయాలు పరిష్కరించుకుంటారు.



మీనరాశి

ఆరోగ్యవృద్ధి, ద్రవ్యలాభం, విద్యా వైజ్ఞానిక రంగంలోని వారికి పురోభివృద్ధి. ఆలోచనలు పలు విధాలుగా మనసును కలవరపరుస్తాయి. అకారణ విరోధాలు, హిత వాక్యాలు పెడచెవిన పెట్టడంవల్ల నష్టపోతారు.





పుష్కర స్నానమ్ సకలధర్మశోభితమ్

శ్రీ వరాటి వేంకటసుబ్బారావు, విజయవాడ

గోదావరినది నీళ్లు త్రాగితే దివ్యానుభూతితో కవిత్వం పుట్టుకొస్తుందనీ, కావేరీనదీ నీళ్లు త్రాగితే మనోహరమైన కళ్యాణిరాగంతో సంగీతం పరిమళించి మనస్సుని దైవసన్నిధి వరకు తీసుకు వెళుతుందని పెద్దలు చెబుతూ ఉంటారు. నదీజలాలు ఎంతో పవిత్రమైనవి. ఈ విధంగా పరబ్రహ్మ ప్రసాదించిన వరం భారతదేశములోని నదులు. ముఖ్యంగా గంగాది ద్వాదశ పుష్కర మహానదీజలాలు. ప్రతిదినం ఉషోదయసమయంలో స్నానము చేయటానికి ముందుగా, "గంగేచ, యమునే, కృష్ణే, గోదావరి, సరస్వతి, నర్మదే, సింధు, కావేరీ జలే౽స్మిన్ సన్నిధింకురు" అని మహిమాన్విత దివ్యభావనతో ప్రార్థిస్తూ స్నానం చేస్తాము. సామాన్య సమయములందే నదీజలాలకు అపారమైన దివ్యప్రభావము కలదని తెలుస్తుండగా ఇక పుష్కరసమయంలో గురుడు మేషాది పన్నెండురాసులలో గంగాదినదులలో సంచరించుసమయాలలో పుష్కరప్రభావము మరింత అధికమై 'పవిత్రీకృతజలము' ఉంటుందని ప్రత్యేకంగా చెప్పనవసరములేదు. మరియు "ఓం భూర్భువస్సువః, తత్సవితుర్వరేణ్యం, భర్గోదేవస్య ధీమహి, ధియోయోనః ప్రచోదయాత్ ఓం శాంతిః-శాంతిః-శాంతిః" అంటూ పుణ్యజలంతో ప్రత్యక్షనారాయణుడైన సూర్యభగవానుని జపంతో నిత్య ధర్మాచరణ పరమేశ్వర ప్రీత్యర్థం ప్రారంభిస్తాము. ఇది భారతీయుల సనాతనధర్మం. 'ధర్మ, అర్థ, కామ, మోక్షాలతో' జీవించే అర్హత సంపూర్ణంగా పొందవచ్చు. ధర్మశాస్త్రాన్ని విస్మరిస్తే పురుషార్థములన్నీ నిరుపయోగమైనవని స్మృతులు మనకు తెలియచేస్తున్నాయి. మానవజన్మ ఉత్తమమైంది. కాబట్టి అన్నికాలాల్లో, యుగాల్లో ఉన్నతులు కావాలని, సకలాత్మ శోభితులుగా వేదవిహితకర్మలు, ధర్మశాస్త్రముల ద్వారా మహర్షులచే చెప్పబడ్డాయి. తత్త్వవేదనచే ఆధ్యాత్మిక జీవనంతోనే సృష్టిస్థితిలయలు మానవజీవితానికి సర్వదేవతలచే, మహర్షులచే శాసించబడింది.

"శతమానంభవతి - శతాయుఃపురుషశ్శతేంద్రియః
ఆయుష్యేవేంద్రియే ప్రతితిష్ఠతి"

– అని కృష్ణయజుర్వేదం.

మానవులకు నూరు సంవత్సరములు ఆయుష్షుని బ్రహ్మ నిర్ణయించాడు. జీవితంలో కొంత శైశవ, బాల్యదశలతో గడచిపోతుంది. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలతో కొంతకాలం యవ్వనం గడచిపోతుంది. అనేక దుష్కృతకర్మల ఫలితంగా ఆయుష్షు తక్కువైపోతుంది. కొందరికి సుకృతకర్మలు, వేదోక్తశాంతికర్మల ద్వారా ఆయుష్షు అధికమవుతుందని చెప్పబడింది. ఈ విధంగా ఉత్తమమైన మానవజన్మ ఎలా సాగిపోతుందో వేదవిజ్ఞానం పురాణాలద్వారా తెలుసుకొంటూనే ఉన్నాము. తత్త్వంగురించి, మృత్యువు – పునర్జన్మము గురించి, ఇహపరలోకాల గురించి ఆలోచించినప్పుడే భక్తిభావన, భగవత్ప్రీతి దృఢంగా ఉంటుంది. మానవజన్మ ఒక జన్మతో జీవికి వచ్చేదికాదు. ఎన్నోజన్మలలో చేసిన పుణ్యఫలంగా ఉత్తమమైన మానవజన్మ పొందామని తెలుసుకోవాలి. జీవితకాలాన్ని వృథాచేయకుండా, తత్త్వదృష్టితో వ్యవహారజీవయాత్ర చేసినవాడు మాత్రమే, తమవంశం ఉత్తమలోకాలకు ముక్తిమార్గానికి అర్హత కలుగుతుందని విశ్వసించాలి. ఈ విధంగా స్వధర్మాన్ని ఆచరించేవాడు పరమాత్మకి ఎల్లప్పుడూ ప్రియుడుగానే ఉంటాడు. వేదోక్తమగు కర్మ – నిత్యము స్నానము – దైవభక్తి, జ్ఞానోదయానికి, సనాతనధర్మానికి ప్రాథమిక దశ.

తస్మాదసక్తః సతతం కార్యం కర్మ సమాచర ।
అసక్తోహ్యాచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః ॥

(భ.గీ.-3-అ.-19శ్లో॥)

అర్జునా! నీవు ఎల్లప్పుడు అనాసక్తియోగమున నిత్యకర్మల నాచరింపుము. అనాసక్తియోగమున శ్రద్ధతో పరమేశ్వర ప్రీత్యర్థం ఆచరించిన కర్మలు పరమ పదాన్ని ప్రాప్తింపచేస్తుంది.

గోదావరి ప్రమాణంలో చాలా పెద్దనది.

శ్రీకృష్ణపరమాత్మ కురుక్షేత్రసమయంలో ముందుగా అర్జునునికి బోధించిన విషయం క్షాత్రధర్మం.

– వేదోక్తమగు – ప్రథమకర్మస్నానము

అస్నాతో నాచరేత్కర్మ జపహోమాది కించన।
స్నాత్వాఽ ధికారీస్యా దేవ దైవే ప్రీత్యే చ కర్మణి॥
అత్యంత మలినః కాయో నవ ఛిద్ర సమన్వితః।
స్రవత్యేవ దివారాత్రం ప్రాతఃస్నానం విశోధనం॥

నవరంధ్రములతో గూడిన ఈ మానవశరీరము అత్యంత మలినమైంది. అట్టి స్థూలశరీరమునకు ప్రాతఃకాలమందు స్నానము దేహాన్ని, మనస్సుని శుద్ధిచేస్తుంది. స్నానరహితుడగుచు జపహోమదానము శ్రాద్ధము మొదలగు వేదకర్మలు చేయరాదు. చేయుటకు అధికారము లేదు అని ధర్మశాస్త్రం తెల్పుతోంది. ఈ స్నానము దశ, సప్తవిధములని కూడ చెప్పబడింది. 'వారుణస్నానం' ప్రథమంగా చెప్పబడినందున మహానది ఉదకములలో మునిగి స్నానము చేయుట వారుణస్నానం. ఉదకములు 'శ్రద్ధా' జనకములు సర్వదేవతాప్రీతికొరకు స్నానము ప్రప్రథమ ఆవశ్యకత్వంగా కృష్ణయజుర్వేదంలో తెలియచేయబడింది. పుష్కరకాలం సకలాత్మ శోభితం. ఇదొక సువర్ణ అవకాశం. దానధర్మాలు, పితృకర్మలు ఆచరించటానికి, అమృతమయమైన జీవం లభిస్తుంది. భూమిచుట్టూ అనేక నదులు ప్రవహిస్తూ ఉన్నాయి. నదులన్నీ స్వయంభూసిద్ధాలే! స్వతంత్రమైనవే! సమస్త జీవరాసులు స్వయంభూ నదీజలాలను ఆశ్రయించినవనడం పరమసత్యం. పుష్కరనదీ జలాలన్నీ పరమ పవిత్రములే! పరమాత్మ అధీనములే! పుష్కర స్నానమ్ సకల ధర్మశోభితమ్. మానవులు అమృతుడయ్యేది జలసంపదవలనేనని చెప్పబడింది.

కాలక్షేపో న కర్తవ్యః క్షీణమాయుర్దినే దినే।
దేహస్య పతనం వీక్ష్య కర్తవ్యం హరికీర్తనమ్॥

పుష్కరతీర్థ–క్షేత్రాలు సందర్శన ధార్మికజీవనం చేసేవారికి, ఉత్తమ జన్మగతులు ఇవ్వగల సామర్థ్యం, నమ్మకాలను మన ఋషులు కల్పించటం మన అదృష్టమనే చెప్పొచ్చు.



గోదావరి పుష్కరాలు

శ్రీఉసులుమర్తి ప్రభాకరరావు, వరంగల్, 0870-6562833

గోదావరి మహాగంగే సర్వపాప విమోచని !
భక్త్యానదత్తం గృహాణార్ఘ్యం మయాదేవి నమోస్తు తే !!

అఖండ భారతావనిలో అఖండ గోదారీవరిగా ముంబాయి దగ్గర గల నాసిక్ త్రయంబకంలో అంతర్వాహినిగా గోదావరి జన్మించినది. మహారాష్ట్రను పునీతం చేస్తూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ – ఆంధ్రరాష్ట్రాలనుండి ప్రవహిస్తున్నది.

పుష్కర నిర్ణయము : శ్రీమన్మథనామ సంవత్సరం అధికాషాఢ మంగళవారం బహుళ త్రయోదశి 14.07.2015 ఉదయం గోదావరి నదిలోకి బృహస్పతి, మూడున్నరకోట్ల జీవనదులు, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, సమస్త దేవతలు, ఋషులు, మునులు పితృదేవతలు వస్తారు.

బృహస్పతి శ్లోకం :

దేవానాంచ ఋషిణాంచ, గురుకాంచన సన్నిభం !
బుద్ధిమంతం త్రిలోకేశం తం నమామి బృహస్పతిం !!

దేవతలకు ఋషులకు ఆఖరికి భిక్షగానికి కూడ బంగారంలా ప్రకాశించే బుద్ధిమంతుడు మరియు స్వర్గ భూ పాతాళ మూడులోకములకు ఇష్టుడైన గురువు 12 రాశులందు వచ్చినప్పుడు, ఒక్కొక్క సంవత్సరంలోకి ప్రవేశించడం వల్ల, ఒక్కొక్క జీవనదికి పుష్కరస్నానం. గోదావరి నదిలో స్నానం చేస్తే పుణ్యం లభిస్తుంది.

గోదావరినది మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రలలో పరీవాక ప్రాంతములు పచ్చని పొలాలు పంటలు పండిస్తోంది. తెలంగాణాలో ఆదిలాబాద్ జిల్లాలోని బాసరక్షేత్రం సరస్వతి అమ్మ దగ్గరనుండి నిర్మల్, తాడపాకల (అర్మూర్) బత్తాపూర్ (ఆర్మూర్) మంచిర్యాల, చెన్నూరు, గూడెంగుట్టు, కరీంనగర్ జిల్లాలోని గోదావరిఖని, మహదేవపూర్, కాళేశ్వరం త్రివేణి సంఘం గోదావరి ప్రణిత, సరస్వతి అంతర్వాహిని అయి, ధర్మపురి నరసింహ దేవాలయం దగ్గరనుండి, మంథని, వరంగల్ జిల్లాలోని ఏటూరు నాగారం, రామనీగూడెం, ఖమ్మం జిల్లాలోని భద్రాద్రి సీతారాముడు వంటి పర్ణశాల పాపికొండలనుండి ఆంధ్రాలోని రాజమహేంద్రవరం చేరుకొంటున్నది.

తుల్య, ఆత్రేయ, భరద్వాజ, గౌతమి, పుష్కర గౌతమిలో స్నానం చేస్తే కోటి జన్మలపుణ్యం కలుగుతుంది. ముందు గోదావరిలో స్నానం చేశాక గంగలో వారణాశిలో స్నానం చెయ్యాలి. పంచభూతాలలో అగ్ని, వాయు, నీరు, ఆకాశము, పృథ్వి, ఇందు భగీరథునిచే గొనిరాబడిన గంగ గోదావరియే అగ్రము. గంగా గోదావరిలు రెండూ సమానమే. గోదావరిలో స్నానం చేస్తే గంగాస్నానఫలితం వస్తుంది.



హిందువులు గంగానది తరువాత గోదావరిని అతి పవిత్రమైన నదిగా భావిస్తారు.

శబరి

పింగళి పాండురంగరావు, ఒంగోలు 9440554114

అరణ్యకాండ అంతంలో రామునితో శబరి సమాగమం జరుగుతుంది. నియమనిష్ఠలు, నిర్లిప్త స్వభావానికి ప్రతీక అయిన శబరి ప్రసంగం రామకథ వికాసంలో ఒక నిర్దిష్ట సోపానంగా కన్పిస్తుంది. దండక – కిష్కింధ మధ్యలో పంపాసరోవర తీరంలో శబరి ఆశ్రమం నెలకొని ఉంది.

మతంగ మహాముని అశ్రమాల్లో నివసించే ఋషి మునులకు సపర్యలు చేస్తూ, తన జీవితాన్నంతా వారి సేవలో సమర్పించుకోవడమే తన జీవిత పరమావధిగా భావించింది శబరి. అంతేకాదు, తన వృద్ధాప్య దశను అతి అణకువతో తీర్చిదిద్దుకుంటూ శ్రీరాముని దర్శన తపనతో తన కాలాన్ని వెళ్ళదీస్తున్నది శబరి.

శ్రీరాముని రాక విషయమై శబరికి ఏమి తెలియక సందిగ్ధావస్థలో ఉంటుంది. ఎక్కడ అయోధ్య, ఎక్కడ పంపా సరోవరం! శ్రీరాముడు ఎప్పుడు అగస్త్య మహాముని ఆశ్రమానికి చేరుకుంటాడో తెలిసిన ఆశ్రమవాసులు, శ్రీరాముడు త్వరలోనే తమ ఆశ్రమానికి వస్తాడని, అప్పుడు శబరి ఆయన దర్శనంతో ధన్యత సాధించుకోవచ్చు అని శబరితో చెప్పి, ఓదారుస్తారు. ఈ మాటలు చెప్పిన మునిపుంగవుల్లో ఏపాటి సత్యం ఉన్నదో, అంతే నిష్ఠ వృద్ధ ప్రబుద్ధ మహిళయైన శబరికి కూడా ఉంది. శబరి నిష్ఠాగరిష్టలు శ్రీరాముని పంపాసరోవర తీరానికి తీసుకు వస్తుంది.



ఆశ్చర్యమేమంటే పంపాసరోవరం, శబరి ఆశ్రమం గురించిన వివరాలు కబంధుడనే రాక్షసుడు శ్రీరామలక్ష్మణులకు అందిస్తాడు. కంబధుడు శ్రీరామునికి శబరి ఆశ్రమం వివరం తెలుపగా, అక్కడ శ్రీరాముడు మతంగ వన దర్శనం చేసుకొంటాడు. శబరికి చిరశాంతిని ప్రసాదిస్తాడు శ్రీరాముడు. ఈ క్రమంలో శ్రీరామలక్ష్మణులు మొట్టమొదటగా శబరి ఆశ్రమంలోకి ప్రవేశిస్తారు. శబరి ఆశ్రమంలోనికి శ్రీరాముడు పాదం పెట్టగానే, శబరి ప్రతి అంగం ఆనంద తరంగిణిలో ఓలలాడింది. ఈ మహాభాగ్యం కోసమే ఆమె చిరకాల నిరీక్షణ. ఆదర సత్కారాలతో, శబరి ఆ ఆదరణీయ అతిథులకు ఆత్మీయ స్వాగతం పలికింది. చిర నిరీక్షణ ఫలంగా లభించిన ఈ అపూర్వ సంగమ సమయం శబరిని అలౌకిక ఆనందాంబుధిలో ముంచెత్తింది.

మహర్షుల నిలయమైన మాతంగ వనంలోకి వెళ్ళి కందమూలాలను, ఫలపుష్పాలను కోసి తెచ్చి రామలక్ష్మణుల కిచ్చి, వారిని తినమని ప్రాధేయపడుతుంది. ఆత్మస్వరూపుడైన శ్రీరాముడు శబరి వినమ్రత, శిష్టత నిష్ఠలకు మెచ్చి ఆనందిస్తూ శబరిని నీ తపస్సు ఎలా సాగుతుంది? అని అడుగుతాడు. సాధ్వి శబరి తన సహజ స్వభావ సాత్వికరీతిలో "శ్రీరామచంద్రా! నీ దర్శనము వలనే తపోఫలం అందింది. నా తపస్సు ఫలించింది" అని చెప్పింది. శబరి శ్రీరామునకు ఫలాలు తినిపించడం, త్రాగునీరు ఇవ్వడం, వనాన్ని వర్ణించడం వల్లనే శ్రీరామునకు వన విశేషాల్ని తెలుసుకోవాలనే ఆసక్తి జనించింది.

ఇహలోక జీవితానికి దూరమై, పంపాతీరంలో ఏకాంత జీవితం కొనసాగిస్తున్న శబరి వీనులకు శ్రీరాముని అమృతవాక్కులు అత్యంత మధురంగా వినిపించాయి. శబరి 'శ్రీరామా! నీవు చిత్రకూటం చేరిన సంగతి తెలిసినప్పటి నుండి నీ రాకకోసం ఎదురు చూస్తున్నాను. మతంగ ఋషులు, మునులు నీరాకను గురించి నాకు చెప్తూ, నీవు వచ్చేవరకు వేచివుండమని నన్ను కోరారు" అని చెపుతుంది. ఇప్పుడే ఆ బంగారు క్షణాలు రానేవచ్చాయి. శ్రీరాముని దర్శించుకొనే భాగ్యం శబరికి లభించింది.

వనంలో లభించే ఫలపుష్పాదులు ఏరికోరి తెచ్చినవన్నీ శ్రీరామునికి సమర్పించగా, రాముడు ఒక్కొక్కటి తింటూ శబరి భాగ్యాన్ని మెచ్చుకున్నాడు. ఇక్కడ అర్థం చేసుకోవాల్సిందేమంటే శ్రీరామునికి ఆనందాన్ని ప్రసాదించే వస్తువు రుచికరమైన పండ్లలో లేదు. శబరి సహజ సాత్విక స్వభావంలోనే ఉంది.

శ్రీ బెనకానహళ్ళి ఆంజనేయస్వామి దేవస్థానం

మనదేవాలయాలు

చంద్రశేఖర్ స్వామి, అనంతపురం, 9441889962

మనోజవం మారుత తుల్యవేగం!
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠాం !
వాతాత్మజం వానర యూథముఖ్యం!
శ్రీరామదూతం శిరసా నమామి!!

అనంతపురం జిల్లా బొమ్మనహాల్ మండలం దేవగిరి గ్రామానికి 2 కి.మీ. దూరంలో శ్రీ బెనకానహళ్ళి ఆంజనేయస్వామి దేవాలయం ఉంది. ఈ దేవాలయం గురించిన చరిత్ర మహిమాన్వితమైనది. క్రీ.శ. 1509 – 30 దశాబ్దముల మధ్య విజయనగరానికి సామ్రాజ్యాధివతి శ్రీకృష్ణదేవరాయలు గురువైనటువంటి శ్రీ వ్యాసరాయ గురు సార్వభౌముల చేత



దక్షిణభారత దేశంలో ప్రతిష్టితమైన 732 దేవాలయాల్లో బెనకానహళ్ళి శ్రీఆంజనేయస్వామి దేవాలయం ఒకటి. శ్రీ వ్యాసరాయ గురు సార్వభౌములచేత ప్రతిష్ఠించబడిందని స్థలపురాణం. ఇక్కడ శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో ప్రతి శనివారం పూజలు బాగా జరుగుతాయి. శ్రావణ, కార్తీక మాసాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. శ్రావణ మాస మూడవ వారంలో "జెల్థి" కార్యక్రమం కన్నుల పండుగగా జరుగుతుంది మరియు అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. భక్తులు వేలసంఖ్యలో పాల్గొని స్వామివారిని సేవించి తరిస్తారు. ఈ మాసంలో దూరప్రాంతాలవారు కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాలనుండి వస్తారు.

హనుమద్వ్రతం, హనుమజ్జయంతి పూజలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ దేవాలయం చుట్టూ వరిపంటలు వేస్తారు. దేవాలయం ముందు పవిత్ర తుంగభద్రనది నీళ్ళ కాలువ ఇక్కడ ఉండటం వలన వాతావరణం ఎంతో ఆహ్లాదంగాఉంటుంది. ప్రతి అమావాస్యనాడు తరలివచ్చే భక్తులతో ఈ ఆలయం కిటకిట లాడుతుంటుంది.

ఇక్కడ ఉన్న దేవాలయ సమీపంలో నైఋతిలో వెలసిన శ్రీకోల్హాపురి దేవి ఆలయం ఉంది. ఈ దేవాలయాన్ని మళ్ళీ గ్రామప్రజలు నిర్మించి విగ్రహప్రతిష్ఠ చేశారు. పడమరకి పాతబడిన శివాలయం ఉన్నాయి.

ఈ స్వామివారి దేవాలయానికి ఆగ్నేయంలో శమీవృక్షం నాగుల విగ్రహాలు ఉన్నాయి. ఇక్కడ దేవాలయంలో అర్చక స్వాములు "పాంచరాత్ర ఆగమ" రీత్యా పూజలు చేయడం జరుగుతుంది.





ఒరు లేయవి యొనరించిన
నరవర! యప్రియము దన మనంబున కగుఁ దా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమధర్మ పథముల కెల్లన్

డా॥అప్పజోడు వేంకటసుబ్బయ్య,
పూర్వకార్యదర్శి, హిందూధర్మప్రచార పరిషత్తు,
తి.తి.దే., 9014878108

ఇవి ధర్మం అంటే ఏమిటో తనకు తెలియచెప్పవలసిందని అడిగిన ధర్మరాజుతో, అంపశయ్యాగతుడైన భీష్ముడు చెప్పిన మాటలు. ఇంత సంక్షిప్తంగా, ఇంత స్పష్టంగా, ఇంత సమగ్రంగా ధర్మం అంటే ఏమిటో లోకానికి తెలియజెప్పిన పద్యం గాని, శ్లోకంగాని, మంత్రంగాని మరొకటి లేదు.

ఇతరులు ఏమి చేస్తే నీ మనస్సుకు బాధ కలుగుతుందో, అది నీవు ఇతరులకు చెయ్యకుండా ఉండటమే ఉత్తమోత్తమ ధర్మం అన్నారు ఆ తాతగారు.

స్వసుఖం, స్వాతిశయం స్వార్థానికి రెండు పార్శ్వాలు. వీటికోసమే మనిషి జీవితంలో అనేక అధర్మాలు, అక్రమాలు, అన్యాయాలు చేస్తాడు. స్వసుఖం కోసం మనిషి ప్రయత్నించటం తప్పేమీ కాదు. అతనికి ఆ హక్కు ఉంది. కాని తన సుఖం కోసం ఎదుటివాళ్ళది, ప్రక్కవాళ్ళది లాక్కొని తానెక్కువ సుఖం అనుభవించటానికి ప్రయత్నించటమే తప్పు. ఇంకొకరు తనది లాక్కుంటే తానెంత బాధపడతాడో ఒక్క క్షణం ఆలోచిస్తే చాలు. అతడు ఆ అధర్మానికి పూనుకోడు.

లోకంలో ఉండే అనేక చట్టాలు, నియమనిబంధనలు అన్నీ మానవుడి స్వార్థాన్ని అదుపులో పెట్టటానికి, అతని మాటలను, చేతలను క్రమబద్ధం చెయ్యటానికి, అతని వల్ల తోడి మానవుడికి ఇబ్బంది కలుగకుండా ఉండటానికి సమాజంలో సుఖశాంతులు శోభిల్లటానికి ఏర్పడినట్టివే. అయితే ఇవి బాహ్య నిరోధకాలు. అందువల్ల మానవుడు వీటి కళ్ళు గప్పి అన్యాయాలకు, అక్రమాలకు పాల్పడుతూనే ఉంటాడు. శిక్షలు తప్పించుకోవటానికి ప్రయత్నిస్తూనే ఉంటాడు. స్వసుఖానికి, స్వాతిశయానికి ప్రక్కవాణ్ణి బాధిస్తూనే ఉంటాడు. సమాజంలో సుఖశాంతులను చెడగొట్టుతూనే ఉంటాడు.

కేవలం చట్టాలు, నియమనిబంధనలు మాత్రమే మనిషి స్వార్థాన్ని అదుపులో పెట్టలేవు. అతని అధర్మాన్ని అడ్డుకోలేవు. ఎదుటివాళ్ళ కుర్చీ మీద కాళ్ళు పెట్టి, ఆ కాళ్ళను తీయమంటే తగవులాడే వాళ్ళను, ప్రక్కవాడి చెల్లెలి పట్ల పశువులా ప్రవర్తిస్తుంటే, ఇదేమిటని ప్రశ్నిస్తే పొగరుబోతు సమాధానం చెప్పేవాళ్ళను, పేదవాళ్ళ కడుపుకొట్టి బలపడే వాళ్ళను, ప్రాణంపోతున్నది వైద్యం చెయ్యండని ప్రార్థిస్తే నా 'ఫీజు' మాట ఏమిటని పీక్కుతినే వాళ్ళను ఏ చట్టాలు సంస్కరించగలవు? ఏ నియమనిబంధనలు అదుపులో ఉంచగలవు?

మౌలికంగా మనిషిలో మార్పు రావాలి. ఏది ధర్మమో, ఏది అధర్మమో ఆలోచించే మనస్తత్త్వం ఏర్పడాలి. పాపభీతి పెరగాలి.

ఏది ధర్మమో, ఏది అధర్మమో తెలియటానికి, ధర్మదృష్టి ఏర్పడటానికి మనిషి వేదాలు చదావాలా? ధర్మశాస్త్రాలు, న్యాయశాస్త్రాలు వల్లెవేయాలా? పురాణేతిహాసాలు పరిశీలించాలా? ఇది సాధ్యమా? అందుకు ఒక జన్మ సరిపోతుందా?

ఇది జరిగే పనేనా?

అందుకే మహానుభావుడు భీష్ముడు అందరికీ సులభంగా అర్థమయ్యేలా ఎంతో స్పష్టంగా, ఎంతో సంక్షిప్తంగా ధర్మం అంటే ఏమిటో మానవాళికి తెలియజెప్పాడు. ఇతరులు ఏం చేస్తే నీకు బాధ కలుగుతుందో నీవు ఇతరులకు అది చెయ్యవద్దు అన్నాడు. అదే పరమధర్మం అన్నాడు.

మనిషి ఈ ఒక్క విషయం ఆలోచించుకొంటే చాలు. అతనిలో ఆత్మవిమర్శ మొదలౌతుంది. మౌలికమైన మార్పు వస్తుంది. ధర్మతత్త్వం పెరుగుతుంది. మంచి ఆలోచనలు మొదలౌతాయి. తాను మాట్లాడే ప్రతిమాటకు దీన్ని అన్వయించుకొంటే చాలు. అతడు ఎదుటివాళ్ళను నొప్పించే మాటలు మాట్లాడటం మానుకొంటాడు. తాను చేసే ప్రతి పనికి దీన్ని అన్వయించుకొంటే చాలు. అతడు పరపీడనకు, అన్యాయాలకు, అక్రమాలకు క్రమక్రమంగా దూరమౌతాడు. అన్నివిధాల పక్వత పొందుతాడు. ఎంతో ఎదుగుతాడు. సమాజశ్రేయస్సుకు దోహదం చేస్తాడు.

మానవ జన్మ చరితార్థతకు ఇంతకంటే ఏం కావాలి?



లోకమున బంధువులైనవారు ఒకరి

కొకరు సమయం వచ్చినప్పుడు తోడ్పడి,

కార్యాలు గడుపుటే స్నేహానికి ఫలము.

నీటియందు ఓడలు బండ్లను,

మెట్టనేలలందు బండ్లు ఓడలను

పరస్పరము నడుపుతున్నపుడు


చూస్తున్నాము కదా!

- భాస్కర శతకము



'శ్రీవారిసేవ'

వాలంటీర్లకు మార్గదర్శకసూత్రాలు



శ్రీవారిసేవలో ఒక వారంపాటు సేవ లందించుటకై పదిమంది సభ్యులకు తక్కువ కాకుండా ఉన్న సముదాయానికి అర్హత లభిస్తుంది. నిస్వార్థసేవ అందించుటకుగాను ఈ సభ్యులకు ఆధ్యాత్మికపరిజ్ఞానం ఉండాలి. స్త్రీపురుషభేదం లేదు. ఆసక్తిగల సమూహంలోని సభ్యులు వారియొక్క పేరు, చిరునామా, వయస్సు, స్త్రీలు/పురుషులు, మొదలైన వివరాలతో ఒక నెల ముందుగా "పౌరసంబంధాధికారి, తిరుమల తిరుపతి దేవస్థానములు, కపిలతీర్థం రోడ్డు, తిరుపతి - 517501" అనే చిరునామాకు పంపాలి. మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు : 0877 - 2263544, 0877 - 2264392.

- శ్రీవారిసేవకు వచ్చే గ్రూపు లీడరు లేదా కో-ఆర్డినేటర్ వాలంటీర్ల పూర్తి వివరాలను తిరుమలలోని శ్రీవారి సేవా సదన్‌లో అందజేయాల్సి ఉంటుంది.
- శ్రీవారిసేవకుల వయసు 18 పూర్తి అయి ఉండి 60 ఏళ్ల లోపు ఉండాలి.
- శ్రీవారి సేవకులు తమ వెంట చిన్న పిల్లలను, వృద్ధులను, వ్యాధిగ్రస్తులను తీసుకు రాకూడదు. ఒకవేళ తీసుకొస్తే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ సేవకు అనుమతించరు.
- శ్రీవారిసేవకు విచ్చేసే శ్రీవారి సేవకులందరూ ఆరోగ్య ధ్రువీకరణ పత్రం (మెడికల్ సర్టిఫికేట్) కాపీని గుర్తింపు పొందిన వైద్యునిచేత అటెస్ట్ చేయించి సమర్పించాల్సి ఉంటుంది.
- సేవకులు తమకు కేటాయించిన తేదీల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటలలోపు తిరుమలలోని ఆర్.టి.సి. బస్టాండు లోపల గల **శ్రీవారి సేవాసదన్**లోని సహాయ ప్రజా సంబంధాల అధికారి/ఆఫీసర్ ఆన్ స్పెషల్‌డ్యూటీ/సూపరింటెండెంట్ వారికి రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.
- సేవాసదన్‌లోని సేవకులకు ఉచిత బస కల్పించబడుతుంది. పురుషులకు సేవాసదన్‌నందు, స్త్రీలకు పి.ఏ.సి-3 నందు వసతి కేటాయించబడును. సేవకులు తమకు కేటాయించిన లాకర్‌కోసం సొంతంగా తాళం, చెవులను తెచ్చుకోవాలి.
- శ్రీవారిసేవాసదన్‌లో ప్రతిరోజు సాయంత్రం 4 గంటలకు డ్యూటీలు కేటాయిస్తారు. సేవకులు ప్రతిరోజు కనీసం ఆరు గంటలు పాటు సేవ చేసేందుకు సిద్ధంగా ఉండాలి.
- సేవా విధుల్లో ఉన్నప్పుడుమాత్రమే శ్రీవారిసేవ స్కార్ఫ్‌లను ధరించాలి.
- బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండురోజుల ముందే సేవకు హాజరై సరైన శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది.
- ఎల్లప్పుడు **'గోవింద'** నామాన్ని స్మరిస్తూ, భక్తులను **'గోవింద** అని సంబోధించాలి.
- శ్రీవారిసేవ పూర్తిగా యాత్రికులకు సహాయం చేసేందుకు ఉద్దేశించిన స్వచ్ఛంద సేవ మాత్రమే. సేవ కోసం టీమ్ లీడరుకు గాని, సిబ్బందికి గానీ ధనరూపంగా, వస్తు రూపంగా ఎలాంటి చెల్లింపులు చేయనవసరం లేదు.
- హిందువులకు మాత్రమే శ్రీవారి సేవ చేసేందుకు అనుమతి ఉంది.
- ప్రతి శ్రీవారి సేవకుడిని హిందువుగా గుర్తించేందుకు తిరునామం/తిలకం లేదా కుంకుమ/చందనం బొట్టు ధరించాలి.
- శ్రీవారి సేవకులు భక్తులలో స్వామివారిని దర్శిస్తూ అంకితభావంతో సేవ చేయాల్సి ఉంటుంది.
- శ్రీవారి సేవకులు తమకు సేవ కేటాయించిన ప్రదేశంలో మాత్రమే సేవ చేయాలి. గర్భాలయంలోసేవ నిర్బంధసేవ కాదు (Compulsory). గర్భాలయంలో సేవకొరకు ఒత్తిడి చేయకండి.
- శ్రీవారి సేవాసదన్‌లోగాని, పి.ఏ.సి.III లోగాని టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచండి.
- సేవాసదన్‌లో ఉండే మహిళాసేవకులు రాత్రిళ్ళు నైటీలు ధరించరాదు.
- శ్రీవారిసేవలో నిర్దేశించిన నియమనిబంధనలను ఏదేని పరిస్థితుల్లో శ్రీవారిసేవకులు అతిక్రమిస్తే వారు రెండేండ్ల వరకు సేవకు అనుమతించబడరు.
- తిరుమలలోని ఆస్థానమండపంలో ప్రతి బుధవారం మధ్యాహ్నం 2-00 గంటలకు శ్రీవారిసేవకులకు శిక్షణ తరగతులు జరుగుతాయి.
- సేవాసదన్ మరియు పి.ఏ.సిల్లో శ్రీవారిసేవకుల కార్యకలాపాలను ఇద్దరు లేదా ముగ్గురు శ్రీవారిసేవ కో-ఆర్డినేటర్లు పర్యవేక్షిస్తారు. దయచేసి వారికి సహకరించండి.

డ్రస్‌కోడ్- పురుషులు: తెలుపు రంగు వస్త్రాలు, స్త్రీలు: మెరూన్ బార్డర్‌తో కూడిన ఆరంజ్ కలర్ చీర, మెరూన్ బార్డర్ రవిక.

ఆపద్రక్షకుడు

మైలవరపు సూర్యనారాయణ, కాకినాడ

అది 1980వ సంవత్సరం మే నెల. కుటుంబసమేతంగా తిరుమలయాత్ర చేయాలని ముందస్తుగా రైల్వేటికెట్లు నమోదు చేసుకున్నాం. నేను, మా ఆవిడ, ఇద్దరు పిల్లలు, ఎనభై ఏళ్ళ మా అమ్మగారు, నా ఇద్దరు బావమరుదులు తిరుమల ఎక్స్‌ప్రెస్ ఎక్కాం.

ముందుగా తిరుపతికి చేరుకుని తిరుమలకు వెళ్ళే బస్సు ఎక్కి కొండకు చేరుకున్నాం. దర్శనం వేళకి గంటకుముందే నియుతవరుసలో నించుని యాత్రికులతో పాటు గోవిందనామస్మరణంతో గంటన్నరలో స్వామివారి దివ్యదర్శనం చేసుకున్నాం.

ఆ తరువాత కొండదిగి అలమేలుమంగాదేవి దర్శనం చేసుకుని శ్రీనివాససత్రం దగ్గర బయలుదేరే పరిసరక్షేత్రదర్శనీయ వాహనంలో కపిలతీర్థం, అగస్త్యమహర్షిఆశ్రమం, కళ్యాణ వేంకటేశ్వరస్వామి కోవెల, కోదండరామస్వామివారి ఆలయం, గోవిందరాజులగుడి మొదలైనవి దర్శనం చేసుకున్నాం.



ఆ సాయంత్రం బజారువీధికి బయలుదేరి వెళుతూండగా మా అమ్మగారు 'నేను కూడా వస్తానంటూ మాతోపాటు బయలుదేరారు. అంతా తిరిగి తీరా సత్రం చేరుకునేసరికి చూడబోతే మా అమ్మగారు కనిపించలేదు. కంగారు కంగారుగా మేము తిరిగిన ప్రాంతాలన్నీ ఎంతగానో వెతికినా ఎక్కడా మా అమ్మగారు కనిపించలేదు. చాలా ఆందోళనకు గురయ్యాం.

ఇక భారం అంతా వేంకటేశ్వరస్వామిపైనేఉంచి, 'నువ్వే మాకు దిక్కు. ఎలాగైనా మా అమ్మగారికి దారి చూపించి సత్రానికి చేరేలా చూడు' అని ఆ దేవుణ్ణి ప్రార్థించాను. ఒకపక్క దట్టంగా చీకటిపడిపోతోంది. ఎనభైఏళ్ళ మా అమ్మగారు ఏం అవస్థ పడుతున్నారోననే కంగారు మరోపక్క. పూర్తిగా నీదే భారం అని ఇంకోసారి దేవుడికి దణ్ణం పెట్టుకున్నాను.

ఒక గంట గడిచే సరికి మా అమ్మగారు సత్రం ప్రధాన ద్వారం వద్ద ఎదురు పడ్డారు. 'నువ్వేమైపోయావోనని మేం కంగారుపడుతూంటే' ఎటు వెళ్ళిపోయావు. మేం వెతకలేక ఆ దేవుడిమీద భారం వేసి కూర్చున్నాం' అన్నా మా అమ్మతో.

అప్పుడు మా అమ్మ మీ వెనుకే నడుస్తూ వచ్చాను. కొంతసేపయ్యాకచూస్తే మీరెవ్వరూ కనిపించలేదు. చాలా కంగారుపడ్డాను. చాలా చీకటిపడిపోయిందే! కొత్తప్రదేశానికి వచ్చానే! సత్రం పేరుకూడా తెలీదాయె! కంగారులో ఏమీ తోచలేదు. నాకు ఆ సమయంలో ఉన్నట్టుండి ఒక పదహారేళ్ళ కుర్రాడు మామ్మగారూ అని పిలిచాడు. చూడగానే సంతోషం వేసింది. నా కంగారు తగ్గి 'నేను మా అబ్బాయి వాళ్ళనుండి తప్పిపోయాను. దోవ తెలీక' అటు ఇటు తిరుగుతున్నాను అన్నాను.

'రండి మిమ్మల్ని నేను తీసుకువెళతాను. మీకు దారి చూపిస్తాను. నాతో రండి' అన్నాడు. ఆయన వెనకే నడుస్తూ వచ్చాను. ప్రధానద్వారం వద్దకు తీసుకొచ్చాడు. 'మా అబ్బాయి వాళ్ళు ఉన్న సత్రం ఇదే బాబూ' అన్నాను. 'మీరు జాగ్రత్తగా వెళ్ళండి మామ్మగారూ.' అన్నాడు. అంతే మళ్ళీ చూద్దామనిపించి ఆ అబ్బాయికోసం చూస్తే కనిపించలేదు అన్నది మా అమ్మ.

బంగారురంగులో ఉన్నాడు. సుమారుగా పదహారేళ్ళు ఉంటాయి. మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే రూపం. నా కళ్ళముందే ఉన్నట్లుంది అంది మా అమ్మ.

నిజంగా ఆ ఆపద్బాంధవుడు, ప్రత్యక్షదైవం ఐన ఆ శ్రీ వేంకటేశ్వరుడే నిన్ను ఇక్కడికి చేర్చాడు. ఆ స్వామి మహిమలు మాకు ప్రత్యక్షంగా చూపించాడు. నీవు పుణ్యాత్మురాలివి కనుక నీకు కనిపించి ఆపదలో ఆదుకున్నాడు. మేమూ ధన్యులమే ఒక విధంగా, అంటూ ఎన్నోవిధాలుగా ఆ ఆపద్రక్షకుడిని పరిపరివిధాల స్తుతిస్తూ ఆ యాత్ర పూర్తి చేసుకున్నాం.



తొలి ఏకాదశి

డా॥ ఎన్.వి.శ్రీనివాసరావు, కాకుమాను, 9030138889

శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం
విశ్వాకారం గగనసదృశం మేఘవర్ణం శుభాంగం ।
లక్ష్మీకాంతం కమలనయనం యోగి హృద్ధ్యానగమ్యం
వందేవిష్ణుం భవభయహరం సర్వలోకైకనాథం ॥

ప్రతీ సంవత్సరం ఆషాఢ శుద్ధ ఏకాదశిని 'తొలి ఏకాదశి'గా అంటారు. పూర్వకాలంలో ఈ తొలి ఏకాదశితోనే సంవత్సర ప్రారంభంగా చూచేవారట! ఈ రోజును 'శయన ఏకాదశి' అని కూడా పిలుస్తారు. శ్రీమహావిష్ణువు ఆరోజు నుండి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు యోగనిద్రలో ఉంటారు. నాటి నుండి శ్రీహరి భక్తులు కామక్రోధాదులను వర్జించి, ప్రయాణాలు చేయకుండ ఒకేచోట ఉండి శ్రీహరిని అర్చిస్తారు. తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి 'ఉత్థాన ఏకాదశి వరకు ఆ నాలుగు మాసాలు చాతుర్మాస్య వ్రతం చేయడం మన భారతీయ సంప్రదాయాలలో ఒకటి. ఆరోజున శ్రీహరి శేషతల్పం పైనుండి మేల్కొంటారు. ఈ చాతుర్మాస్య దీక్షను సన్యాసులు మాత్రమే కాదు భక్తులందరూ దీనిని ఆచరిస్తూ ఉంటారు.

గోపద్మవ్రతం

ఈ తొలి ఏకాదశినాడు గోపద్మవ్రతం చేయడం ఎంతో విశిష్టమైందిగా చెప్తారు. గోమాత పూర్తిగా విరాట్ పురుషుని రూపంతో పోల్చబడింది. గోవునకు ముఖమందు వేదాలు, కొమ్ములందు హరిహరులు, కొమ్ముల చివర ఇంద్రుడు, లలాటంలో ఈశ్వరుడు, కర్ణాలందు అశ్వనీదేవతలు, నేత్రాలలో సూర్యచంద్రులు, దంతాలందు గరుడుడు, జిహ్వలో సరస్వతి, ఉదరంలో స్కందుడు, రోమకూపాలందు ఋషులు, పూర్వభాగంలో యముడు, పశ్చిమభాగంలో అగ్ని, దక్షిణభాగంలో వరుణ కుబేరులు, వామభాగంలో యక్షులు, ముఖంలో గంధర్వులు, నాసాగ్రంలో పన్నగలు, అపానంలో సరస్వతి, గంగాతీర్థాలు, గోమయంలో లక్ష్మి, పాదాగ్రంలో ఖేచరులు, అంబా అనే పిలుపులో ప్రజాపతి, స్తనములందు చతుస్సాగరాలు ఉన్నట్లు వర్ణింపబడింది. కావున గోమాతలను పూజిస్తే సమస్తదేవతలను పూజించినట్లుగా, సమస్త తీర్థాలలో పుణ్యస్నానం చేసిన పుణ్యఫలం లభిస్తుందని, గోమాతకు ఇంతటి పూజ్యస్థానమిస్తూ అథర్వణవేదంలో, బ్రహ్మాండపురాణంలో, మహాభారతంలో, పద్మపురాణంలో ఇలా ఎన్నో గాథలు ఉన్నాయి.

జూలై 27
తొలి ఏకాదశి



గోమాత నివసించే గోశాలను ఈ తొలి ఏకాదశినాడు మరింతగా శుభ్రం చేసి అలికి ముత్యాలముగ్గులతో తీర్చిదిద్ది గోశాల మధ్యభాగంలో బియ్యపు పిండితో 33 పద్మాల ముగ్గులు పెట్టి శ్రీమహావిష్ణువు ప్రతిమను ఆ పద్మాలపై ఉంచి విధివిధానంగా పూజించి, పద్మానికి ఒక్కొక్క 'అప్పడాన్ని' వాటిపైన ఉంచి ఆ అప్పడాలను, వాయనాలను దక్షిణ తాంబూలాదులతో సమర్పించికొని, గోమాతను పూజించేవారికి సకలాభీష్టాలు నేరవేరుతాయి. ఈ గోపద్మవ్రతాన్ని ఆచరించి పుణ్యప్రదమైన తొలిఏకాదశి పర్వదినం శుభప్రదంగా జరుపుకోవాలి.

చాతుర్మాస్యదీక్ష

ఆషాఢే తు సితే పక్షే ఏకాదశ్యాముపోషితః
చాతుర్మాస్య వ్రతం కుర్యా ద్యత్కించి న్నియతో నరః ।
వార్షికాంశ్చ తురో మాసాన్వాహయేత్కేనచిన్నరః
వ్రవతేన నోచే దాప్నోతి కిల్బిషం వత్సరోద్భవమ్ ॥

చాతుర్మాస్య దీక్షాప్రశస్తిని గురించి స్కాంద భవిష్యోత్తర పురాణాలలో విపులంగా వివరింపబడి ఉంది. మన హిందూ సంస్కృతిలో ఏకాదశతిథి ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఈ చాతుర్మాస్య దీక్ష పూర్తి చేసినవారికి అశ్వమేథ యాగఫలం సిద్ధిస్తుందని మన పురాణాలు ఘోషిస్తున్నాయి. కొందరు గృహస్థులైన శ్రీహరి భక్తులు కూడా ఒంటిపూట భోజనం చేస్తూ అతిథి, అభ్యాగతులను సేవిస్తూ వర్జనీయ పదార్థాలను విసర్జించి ప్రయాణాలు చేయకుండా ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ చాతుర్మాస్య దీక్షను పూని శ్రీహరిని ఆరాధిస్తారు. ఈ చాతుర్మాస్య దీక్షను భక్తి శ్రద్ధలతో ఆచరించిన వారికి ఇహలోక కీర్తిప్రతిష్టలతో పాటు విష్ణు సాయుజ్యం ప్రాప్తిస్తుంది.



బాలప్రబోధం

ప్రహ్లాదుడు



కే.బి.నాగరాజశర్మ, హిందూపురం, 08556-223581

పాండవగీత పరమభాగవతులను పేర్కొంటూ ముందుగా ప్రహ్లాదునే స్మరిస్తుంది.

ప్రహ్లాద నారద పరాశర పుండరీక
వ్యాసాంబరీష శుక శౌనక భీష్మ దాల్భ్యాన్ ।
రుక్మాంగదార్జున - వసిష్ఠ విభీషణాదీన్
పుణ్యానిమాన్ - పరమభాగవతాన్ స్మరామి ॥

భగవంతుని వాత్సల్యరసాన్ని పరిపూర్ణంగా ఆస్వాదించిన వాడు ప్రహ్లాదుడు. భగవంతుడు వాత్సల్య గుణోజ్జ్వలుడనే దానికి ప్రహ్లాదుడే సాక్షి.

వాత్సల్యాది గుణగణాలు కల్గిఉండటంచే శ్రీపతి ఒక్కడే, జగత్తుకు సేవింపదగినవాడు. ఈ విషయంలో వాత్సల్యానికి - ప్రహ్లాదుడు వస్తాడు.

పూర్వము బ్రహ్మపుత్రులగు సనకసనందనాదులు, విష్ణులోకానికి పంచషడ్వయస్కులుగా వెళ్ళగా విష్ణుద్వారపాలకులగు జయవిజయులు వారలనడ్డగిస్తారు. అప్పుడా ఋషులు వారిని భూలోకంలో జన్మించండని శపిస్తారు. వారు హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగా, రావణ కుంభకర్ణులుగా, శిశుపాల దంత వక్త్రులుగా భూలోకాన జన్మిస్తారు. రావణ కుంభకర్ణులు రాముని చేతనూ, శిశుపాల దంతవక్త్రులు శ్రీకృష్ణుని చేతను చంపబడ్డారు.

హిరణ్యాక్షుడు యజ్ఞవరాహరూపం దాల్చిన శ్రీహరిచేత సంహరింపబడ్డాడు. హిరణ్యాక్షుడి అన్న హిరణ్యకశిపుడు. అతని భార్య కయాధు.

తెలుగు భాగవతమునందు ప్రహ్లాదుని తల్లి "లీలావతి" గా చెప్పబడినది. ఆమె జంభుని కూతురు.

తమ్ముడు హిరణ్యాక్షుడు వరాహమూర్తిచే చంపబడుటచే అతడు శ్రీహరిపై అకారణ ద్వేషాన్ని పెంచుకొంటాడు. చెట్టు మొదలు చిన్నమయిన కొమ్మలేరీతిగ ఎండిపోవునో, శ్రీహరినష్టుడైనా దేవతలందరు నశిస్తారని భావిస్తారు. అయితే హిరణ్య కశిపుడు యజ్ఞయాగాదులకు విఘ్నం కల్గించ వలసినదని, ద్విజులు, గోవులు ఉన్నప్రదేశాలపై దాడి చేయమని అనుచరులనాదేశిస్తాడు. తల్లిని ఓదార్చి బ్రహ్మదేవుని గూర్చి గొప్ప తపము ఆచరిస్తాడు. బ్రహ్మదేవుడు ప్రత్యక్షమయి వరము కోరకోమని అడుగగా..

పంచభూతములందు కాని, దిక్కుల్లో కాని, రాత్రి కాని పగలు కాని, చీకటిలోకాని వెలుతురులో కాని, జలజంతువులచే కాని, రాక్షసులచేకాని, మృగములచేత కాని, సర్పములచేతకాని, దేవతలచేతకాని, నరులచేతకాని, శస్త్రాలచేకాని మృత్యువు లేని జీవితము ఇమ్మని కోరాడు. బ్రహ్మదేవుని వరంతో గర్వితుడైన హిరణ్యకశిపుడు దేవతలను బాధిస్తాడు. దేవతలు విష్ణుమూర్తిని ప్రార్థించగా విష్ణుమూర్తి దేవతలకభయమిస్తాడు.

అప్పుడు నారదుడు త్వరలో రాబోయే ప్రహ్లాదుని జనన సంబంధ గుణగణాలనిట్లు వివరిస్తాడు.

ప్రహ్లాదుడు వేదముల యందు సద్భావన కలవాడు, చక్కటి శీలసంపదకలవాడు, జితేంద్రియుడు, సమస్త ప్రాణిరాశులను తనవలె చూసుకొనేవాడు, పెద్దలపట్ల దైవభావనకల్గినవాడు, కోరికలు లేనివాడు, చక్కటి స్నేహశీలి అని తెలియచేస్తాడు.

ప్రహ్లాదుడు జన్మించిన దగ్గరినుండి కూర్చున్నా, తినుచున్నా, తిరుగుచున్నా, త్రాగుచున్నా, పలుకుచున్నా గోవింద పాదారవింద ధ్యానమగ్నుడై లోకాన్నే మరిచేవాడు. అప్పుడు హిరణ్యకశిపుడు ప్రహ్లాదునితో

"చదువని వాడజ్ఞుండగు
చదివిన సదసద్వివేక చతురత కల్గున్,
చదువగ వలయును జనులకు,
చదివించెద నార్యులొద్ద చదువుము తండ్రీ!"

అని అంటాడు.

అసురులకు పౌరోహిత్యముకై శుక్రాచార్యుడు ఉండేవాడు. శుక్రాచార్యుని పుత్రులు శండామర్కులు. (తెనుగుభాగవతమున వారిపేర్లు చండామర్కులు) వారిని దైత్యరాజగు హిరణ్యకశిపుని ఇంటివద్ద ఉండేవారు. కావున హిరణ్యకశిపుడు ఆచండామర్కులను పిలిపించి తనపుత్రుని నీతిశాస్త్రకోవిదుని కావించుమని కోరి గురువులకప్పగిస్తాడు.

కొంతకాలం తర్వాత తన పుత్రుని చదువుసంధ్యలను తెలిసికోవాలని హిరణ్యకశిపుడు పుత్రుని రప్పించి అతడు నేర్చుకొన్నదేమిటని ప్రశ్నిస్తాడు. అప్పుడు ప్రహ్లాదుడు తండ్రితో, ఓ అసురవర్యా! నేను, నాది అనే మిథ్యాభినివేశం వల్ల కలత చెందిన ప్రాణులకు, తమ అధఃపతనానికి కారణభూతమైన అంధకూపం వంటి గృహాన్ని వదలిబెట్టి, అడవిచేరి అందు హరిని ఆశ్రయించుటకు మంచిదని తాను తలంచుచున్నానని, అనగా ఈ మాటలు విని హిరణ్యకశిపుడు నవ్వి, పరబుద్ధులచే బాలురబుద్ధి భేదించును. కాన ఇతనిని సరియైన శిక్షణ ఇవ్వమని గురువులతో పలుకుతాడు. విష్ణువనే గొడ్డలికి ఈ ప్రహ్లాదుడు కర్రవంటివాడు. అని నిందిస్తాడు. మరికొంత కాలానికి సకలశాస్త్రములు నేర్చి ప్రహ్లాదుని తన తండ్రివద్దకు గురువులు తేగా ప్రహ్లాదుడు తన తండ్రి పాదపద్మాలకు నమస్కరిస్తాడు. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని తన తొడపై కూర్చోబెట్టుకొని, ఆనంద బాష్పాలతో, పుత్రుని శిరస్సును నిమిరి, ప్రహ్లాద కుమారునితో –

"నాయనా! ప్రహ్లాద! నీవు నేర్చుకొన్నదానిలో మంచిదేదో చెప్పు. ఇంతకాలం నీ గురువు నుండి నీవేమి నేర్చావు"? అని అడిగాడు.

అప్పుడు ప్రహ్లాదుడు తండ్రితో

"శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్

అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్"

అని అంటాడు.

ఈ నవవిధలక్షణాలు గల భక్తిని భగవంతుని ముందుంచటమే చదువులలో ఉత్తమమైనది.

ఈ తొమ్మిది విధాలైన భక్తి మార్గాలననుసరించే వారే బుద్ధిమంతులని ప్రహ్లాదుడు తండ్రితో చెబుతాడు.

ఇక్కడ పోతనామాత్యుడు వ్యాసుల సూత్రములకు భాష్యమా అనే విధంగా "మందారమకరందమాధుర్యమునదేలు" అని అనేకానేకములైన ఉపమానాలతో సమర్థిస్తాడు.

'చక్రి చింతలేని జన్మ నీటిబుడగలాంటిది. విష్ణుభక్తి లేని పండితుడు పండితుడు కాడు. అతడు రెండు కాళ్ళున్న పశువే' అని అనేక రీతులుగా దానవేంద్రునకు ప్రహ్లాదుడు విష్ణుభక్తి యొక్క ప్రాశస్త్యాన్ని తెలియజేస్తాడు. ఈ మాటలు విని హిరణ్యకశిపుడు ఆగ్రహంతో ప్రహ్లాదుని ఒడి నుండి క్రిందికి త్రోసి ఈరీతిగా అంటాడు.

ఇతరుడైనా మనమేలు కోరువాడు బంధువే. బంధువైనా మనమేలు కోరనివాడు శత్రువే. మనదేహమునుంటి పుట్టినదైననూ రోగము త్యాజ్యమే. ఆరణ్యకమైననూ ఔషధము గ్రాహ్యమే. అహితమైన అంగాన్ని ఛేదించినవాడు సుఖంగా బ్రతుకుతాడు.

ప్రహ్లాదునికి మరో అవకాశం ఇవ్వదల్చాడు. కాని అది నిష్ఫలం కావడంతో ప్రహ్లాదుని వివిధ ఉపాయాలతో హింసింపచేస్తాడు. అతనిని ఏనుగులతో త్రొక్కిస్తాడు. పాములతో కరిపిస్తాడు. కొండలనుండి త్రోయిస్తాడు. విషముత్రాగింపచేస్తాడు. నీటియందు ముంచుతాడు. ఏమైనా ప్రహ్లాదుడు చావలేదు. హరినామస్మరణ వీడలేదు.

వీటితో భయచకితుడైన హిరణ్యకశిపునకు వీనిచేత తనకు మరణము వాటిల్లునా అను శంక కల్గుతుంది. చండామర్కుల సూచనతో శుక్రాచార్యునివద్ద త్రివర్గంబు పఠింపదలచెను. ప్రహ్లాదుడు గురుకులానికి దైత్యబాలురను కూడగట్టుకొని వారికి సంసారంలోని అసారత్వమును, భక్తిప్రాశస్త్యాన్ని తెలియచేయ సాగెను.

దయనుగూర్చి ప్రహ్లాదుడు దానవులతో "తస్మాత్సర్వేషు భూతేషు యాంకురుత దానవాః" సమస్త జీవరాశులందు దయ చూపమని బోధిస్తాడు.

భక్తి యొక్క విశిష్టత గూర్చి చెప్పుచూ–

భగవంతుడు భక్తిచేతనే ప్రీతిని పొందుతాడు. దానము చేతకాని, తపస్సుచేత కాని, యజ్ఞయాగాదులచేత కాని, శౌచము చేత కాని, వ్రతములచేత కాని ప్రీతుడు కాడు. మిగతావి అంతా పరిహాసము వంటివే అని అంటాడు.

మాతృగర్భములో ఉన్నప్పుడే నారదునిచే ఉపదేశింపబడి తాను భగవద్భక్తిని సంతరించుకొన్నట్లు ప్రహ్లాదుడు తన సహవిద్యార్థులకు తెలియచేస్తాడు. హిరణ్యకశిపుడు తపస్సు ఆచరించడానికి మందరాచలానికి వెళ్లివుంటాడు. ఆ సమయమున దేవతలు రాక్షసులపై దాడికావించారు. రాక్షసులు కాందిశీకులై దశదిశల పరుగిడినారు. ఇంద్రుడు గర్భవతిగానున్న ప్రహ్లాదుని తల్లిని బంధించికొనిపోతుండగా దేవర్షి నారదుడడ్డగించి, ఆమె గర్భంలో పరమభాగవతుడు కలడని పలికి తన ఆశ్రమానికి కొనిపోతాడు. దైత్యరాజు వచ్చేంత వరకు తన ఆశ్రమంలోనే ఉంచు కొంటాడు. నారదుడు ఆ సమయంలో ప్రహ్లాదునికి ధర్మము యొక్క తత్త్వాన్ని జ్ఞానాన్ని ఉపదేశిస్తాడు. ఈ కారణము చేతనే ప్రహ్లాదుడు పరమ భాగవతుడయ్యెను.

ప్రహ్లాదునిపై ఆగ్రహం వహించి హిరణ్యకశిపుడు "ఆ హరి ఎక్కడున్నాడని గద్దించి" అడుగగా ఆ బాలుడిట్లన్నాడు తండ్రీ! ఆ పరమేశ్వరుడు సముద్రములో ఉన్నాడు. గాలియందున్నాడు. ఆకాశమునందున్నాడు. భూమి యందున్నాడు. అగ్నియందున్నాడు. రాత్రింబవళ్ళయందున్నాడు. సూర్యచంద్రులందు ఉన్నాడు. ఆత్మయందును, ఓంకారమునందును, త్రిమూర్తులయందును యున్నాడు. ఇక్కడ అక్కడ అని వెదుకనేల.

"ఇందు గలడందు లేడని
సందేహము వలదు చక్రిసర్వోపగత
డెందెందు వెదకి చూచిన
నందందే గలడు దానవాగ్రణి వింటే." అని అన్నాడు.

అప్పుడు అంతటా ఉండిన, ఈ స్తంభమున నీ చక్రిని చూపగలవా? అని తన అరచేతితో స్తంభాన్ని కొట్టాడు. తన భృత్యుని భాషితమును సత్యము చేయుటకు, భగవంతుడు అద్భుతమైన నృసింహరూపముతో ఆ స్తంభమునుండి ఆవిర్భవించాడు.

అతడు హిరణ్యకశిపునకిచ్చిన వరమునకు భంగము కాకుండా నృసింహమూర్తి హిరణ్యకశిపుని తన తొడపై కూర్చుండబెట్టుకొని, సంధ్యాసమయమున తన గోర్లతో అతని యెదను చీల్చివేసెను.

నృసింహస్వామి కోపాన్ని మాన్పుటకు లక్ష్మీదేవిని అతనిచెంతకు దేవాదులు పంపారు. ఆ రూపాన్ని ముందెన్నడు చూడకపోవుటచే లక్ష్మీదేవి అతని చెంతకు వెళ్ళేందుకు భయపడింది. అప్పుడు బ్రహ్మ నృసింహుని శాంత పరచుటకు ప్రహ్లాదుడినే పంపాడు. ప్రహ్లాదుడు అతనిని స్తుతించి శాంతింపచేశాడు.

అప్పుడు నృసింహస్వామి ప్రహ్లాదునితో, అనుభవించుట చేతనే పాపపుణ్యాలు నశిస్తాయి. కానీ నీవు వాటిని అనుభవించి, సరియైన సమయమున కాలధర్మము పొందుతావు. దేవతలు కూడ కొనియాడు కీర్తిని పొందుచూ నాలో ఐక్యమొందుతావు అని అన్నాడు.

ప్రహ్లాదుడు, తన తండ్రి గావించిన పాపాములనుండి పరిశుద్ధుడు కావలెనని కోరెను. స్వామి వరము కోరుకొనుమని ప్రహ్లాదుని నిర్బంధించగా, తనకు భగవంతుని యందు అచంచలమైన భక్తి కలుగునట్లుగాను, కోరికలు కలుగకుండా వరమును కోరెను. నారదుడు ప్రహ్లాదుని రాజ్యమునందు అభిషిక్తుని గావింపచేసెను.

ప్రహ్లాదుడు విష్ణుమూర్తిని గురించి భక్తితో నామస్మరణం చేసినందువల్ల పావనుడై రాజుగా అతను దీర్ఘకాలం రాజ్యపరిపాలన చేసినప్పటికి, భక్తుడుగా మాత్రమే అతని కీర్తి శాశ్వతంగా చరిత్రపుటల్లో భక్తప్రహ్లాదుడుగా సువర్ణాక్షరాలతో లిఖించబడింది. కావున ధనము కంటే ధర్మం దైవభక్తి చాలా ముఖ్యమని ప్రహ్లాదుడు నిరుపించాడు.



శ్రీరామనామామృతం

కె. కౌండిన్య తిలక్, సికింద్రాబాద్, 9441234325

సాక్షాత్ శ్రీమహావిష్ణువు త్రేతాయుగమునందు శ్రీరామచంద్రుడి రూపములో నరుడిగా అవతరించి మానవజాతికి రీతినీ, నీతినీ, నడవడినీ నేర్పాడు. మానవుడిగా పుట్టి ఆదర్శజీవనవిధానాన్ని అనుసరిస్తూ, మానవీయతను ఆచరణలోకి తెచ్చి చూపుతూ నరుడు నారాయణుడిగా ఎలా ఎదగవచ్చో చేసి చూపించాడు. ఒకమంచి పుత్రుడు, ఒక మంచి భర్త, ఒకమంచి చక్రవర్తి ఇలా మనిషిగా ఉంటూనే ఎన్ని రూపాలుగా ఎంతమంచిని పెంచవచ్చో, పంచవచ్చో ఆచరణలో చూపాడు. అలాంటి సకలసుగుణాభిరాముడి పేరు తలిస్తేనే చాలు మన దుర్భరదురిత మానవజీవితాలు పరమపావనమౌతాయి.

శ్రీరామనామము మహాపాతకనాశనము! శ్రీరామ నామము భవసాగరతరణము! శ్రీరామనామము సకలమంత్రార్థ సమ్మితము! శ్రీరామనామము సకలశాస్త్రార్థసంయుతము! అలాంటి పరమపవిత్రమైన ఆ శ్రీరామనామ మహిమను గూర్చి మహామహులు ఏమని సెలవిచ్చారో సెలవివ్వడమే ఈ వ్యాసోద్దేశము. 'రామోవిగ్రహవాన్ ధర్మః' అనగా రాముడు మూర్తీభవించిన ధర్మస్వరూపుడు. రాముడు గుణవంతుడు, వీర్యవంతుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు. దృఢవ్రతుడు. అతడు ఈ లోకములో అవతరించినది పితృవాక్య పరిపాలనావ్రతము, సాధుసంరక్షణావ్రతము, ఏకపత్నీ వ్రతము ఆచరించడానికే! సత్యవాక్పరిపాలన, మరియు పరదారాపహరణాశీలియైన రావణసంహారములను అతడి జీవనరథానికి ప్రధానమైన రెండు చక్రాలుగా చెప్పుకోవచ్చు.

శ్రీరామమంత్రము కీర్తించటంవలన వేలకొలది బ్రహ్మహత్యలను, వందలకొలది హత్యలను చేసిన వానికి కలుగునట్టిపాపాలు తొలగుతాయి. స్వర్ణాపహరణము, సురాపానము, గురుభార్యాగమనము; కోట్లకొలది ఉపపాతకముల ఆచరణవలన వచ్చిన పాపరాశి అంతా శ్రీరామనామకీర్తనవలన నశిస్తుంది.

శ్రీరామునికథ శ్రీమద్రామాయణము. ఇందులో నాయకుడు శ్రీరాముడు. ఇది అత్యంత మధురమైనకావ్యంగా మానవజాతిని నాటినుండి నేటివరకు అలరింపచేసింది. దానికి కారణము

కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్।
ఆరూహ్యకవితాశాఖాం వందేవాల్మీకి కోకిలం ॥



వాల్మీకి ఒక కోకిల. కవిత్వమనెడికొమ్మనెక్కి సహజ మధురమైన ఆర్ద్రకంఠముతో "రామా" రామా" యని కూయు చుండుటచేత ఈ కావ్యమునకు మాధుర్యమబ్బినదని పెద్దల నిర్ణయము

ఎవ్వడు క్షణమైనను రామారామాయని మనోహరముగా గానము చేస్తాడో అతడు బ్రహ్మహత్య చేసినవాడైనను సురాపానము చేసినవాడైనను, ఎట్టి పాపము గలవాడైనను అతని సమస్తపాపములు ఆ క్షణమే నశిస్తాయి. "రమంతేయోగినః అస్మిన్ ఇతిరామః" అని

రామశబ్ద నిర్వచనము. యోగులు దేనియందు రమించుచున్నారో అదిరామపదవాచ్యమని చెప్పుటచే ''రామ'' శబ్దము పరబ్రహ్మప్రతిపాదకమగుచున్నది. ఈ రామనామమహిమ అనంతం. అద్వితీయం. అనన్యం.

రామారామాయని ఏ మనుజులు జపిస్తారో వారలకు ఈ భూలోకముననే మృత్యుభయము మొదలగునవి గలుగవు.

బ్రాహ్మణుడుగానీ, రాక్షసుడుగానీ, పాపముగలవాడుగానీ, ధర్మముగలవాడుగానీ దేహమును విడుచునపుడు రాముని స్మరించునేని ఉత్తమమైన మోక్షమును పొందుతాడు. ఈ రామనామమహిమచేత చిత్తశుద్ధి కలుగుతుంది తద్వారా ఆత్మజ్ఞానము ఆపై మోక్షము కలుగుతుంది. ఇంతటి మహత్తరమైనదికనుకనే కవులు శతకకారులు శ్రీరామనామాన్ని ఎంతో అందంగా వర్ణించారు.

దాశరథీశతకకారుడైన కంచర్లగోపన్న రామనామ విశేషమును ఈ విధంగా తెలిపాడు:

"రా" కలుషంబెల్లబయలంబడద్రోచిన "మా" కవాటమై అదీకొనిప్రోచునిక్కము" -

రామాయను దివ్యనామములోని రేఫము పాపములు అన్నింటిని బయటికి తరుమగా మా అనెడి అక్షరము తలుపువలె అడ్డుపడి వానిని ఎదురించి లోపలికి రాకుండునట్లు చేసి ఆశ్రితులను కాపాడుతుంది.

